జూన్ 15, 2015

# కావలికోట

యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది



అధ్యయన ఆర్టికల్స్


జూలై 27–ఆగస్టు 2

క్రీస్తు—దేవుని శక్తి

3వ పేజీ • పాటలు: 14, 5

ఆగస్టు 3-9

ఆయన ప్రజల్ని ప్రేమించాడు

8వ పేజీ • పాటలు: 25, 30

ఆగస్టు 10-16

మనం పవిత్రంగా ఉండగలం

13వ పేజీ • పాటలు: 52, 51

ఆగస్టు 17-23

మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవించండి —మొదటి భాగం

20వ పేజీ • పాటలు: 138
యెహోవా నీ పేరు (కొత్త పాట), 11

ఆగస్టు 24-30

మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవించండి —రెండవ భాగం

25వ పేజీ • పాటలు: 22, 38



## పనామా

**ముఖచిత్రం:** పనామా వాయువ్య తీరంలో ఉన్న బోకాస్ డెల్‌టోరో దీవుల్లోని ప్రజలకు ప్రకటించడానికి యెహోవాసాక్షులు పడవల ద్వారా వెళ్తారు. వాళ్లు నోబెరా భాషలో కూడా సాక్ష్యమిస్తున్నారు

జనాభా
**39,31,000**

ప్రచారకులు
**16,217**

క్రమ పయినీర్లు
**2,534**

పనామాలో ఉన్న 309 సంఘాల్లో, 180కు పైగా ప్రత్యేక పయినీర్లు ఉన్నారు. ఆ దేశంలోని 35 సంఘాల్లో, 15 గ్రూపుల్లో సుమారు 1,100 మంది ప్రచారకులు నోబెరా భాష మాట్లాడతారు. అంతేకాక 16 సంఘాలు, 6 గ్రూపులు పనామియన్ సంజ్ఞా భాషను ఉపయోగిస్తున్నాయి. వాటిలో దాదాపు 600 మంది ప్రచారకులు ఉన్నారు

# అధ్యయన ఆర్టికల్స్

- క్రీస్తు—దేవుని శక్తి
- ఆయన ప్రజల్ని ప్రేమించాడు

యేసు చేసిన కొన్ని అద్భుతాల గురించి ఈ ఆర్టికల్స్ వివరిస్తాయి. అవి, ఉదారంగా ఇవ్వడం గురించి, ఇతరులకు సహాయం చేయడం గురించి విలువైన పాఠాలు మనకు నేర్పిస్తాయి. అంతేకాదు, యేసుకున్న కొన్ని ఆకర్షణీయమైన లక్షణాల గురించి కూడా నేర్పిస్తాయి. భవిష్యత్తులో భూవ్యాప్తంగా జరగబోయే మరిన్ని అద్భుతాల కోసం ఎదురుచూసేలా ఈ ఆర్టికల్స్ మనకు సహాయం చేస్తాయి.

- మనం పవిత్రంగా ఉండగలం

నైతికంగా దిగజారిపోయిన నేటి లోకంలో పవిత్రంగా ఉండడం ఒక సవాలే. అపవిత్ర ఆలోచనలకు దూరంగా ఉండడానికి, యెహోవా ఉన్నత నైతిక ప్రమాణాలకు అంటి పెట్టుకుని ఉండడానికి సహాయం చేసే విషయాల్ని ఈ ఆర్టికల్‌లో తెలుసుకుంటాం. అవేంటంటే, యెహోవాతో స్నేహం, ఆయన వాక్యంలోని సలహాలు, పరిణతిగల తోటి క్రైస్తవుల సహాయం.

- మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవించండి —మొదటి భాగం
- మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవించండి —రెండవ భాగం

క్రైస్తవులు ప్రార్థించే ప్రతీసారి, యేసు నేర్పించిన మాదిరి ప్రార్థనలోని మాటల్నే మళ్లీమళ్లీ చెప్పరు. కానీ ఆ ప్రార్థనలో యేసు నేర్పించిన విషయాల నుండి మనమెంతో నేర్చుకోవచ్చు. ఆ ప్రార్థనకు అనుగుణంగా మనమెలా జీవించవచ్చో ఈ ఆర్టికల్స్‌లో చర్చిస్తాం.

## ఇంకా ఈ సంచికలో


18 “కింగ్స్‌లీ చేయగలిగాడంటే నేనూ చేయగలను!”

30 ‘మీకు సహనం అవసరం’

32 మీకు జ్ఞాపకమున్నాయా?



కావలికోట
యెహోవా రాజ్యాన్ని ప్రకటిస్తోంది

జూన్ 15, 2015
Vol. 136, No. 12 Monthly and Supplemental quarterly editions TELUGU June 15, 2015


ఈ ప్రచురణ అమ్మకానికి కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న బైబిలు విద్యాపనిలో భాగంగా స్వచ్ఛంద విరాళాల సహాయంతో ప్రచురించబడుతోంది. ప్రత్యేకంగా సూచించబడని లేఖనాలు పరిశుద్ధ గ్రంథము నుండి ఉల్లేఖించబడ్డాయి. కొన్ని లేఖనాల్లో విషయాన్ని నొక్కి చెప్పడానికి **ఏటవాలుగావున్న ముద్రక్షరాలు** ఉపయోగించబడ్డాయి. లేఖనం ఉన్నచోట *NW* అని ఉంటే అది ఆధునిక ఇంగ్లీషు భాషలోని పరిశుద్ధ లేఖనముల నూతనలోక అనువాదము నుండి అనువదించబడిందని అర్థం.


Published and Printed by The Watch Tower Bible and Tract Society of India at 927/1 Addevishwanathapura, Rajanukunte, Bangalore 561203, Karnataka. **మీ ఉత్తరాలను ఈ చిరునామాకు పంపించండి:** Post Box No. 6441, Yelahanka, Bangalore 560064, Karnataka.


2015 Watch Tower Bible and Tract Society of Pennsylvania.


Printed in India.



# క్రీస్తు దేవుని శక్తి

"క్రీస్తు దేవుని శక్తి."—1 కొరిం. 1:24.

యెహోవా తన శక్తిని యేసుక్రీస్తు ద్వారా అసాధారణమైన విధానాల్లో చూపించాడు. యేసు భూమ్మీదున్నప్పుడు చేసిన కొన్ని అద్భుతాల గురించి బైబిల్లో ఉంది. వాటిని చదివినప్పుడు మన విశ్వాసం బలపడుతుంది. (మత్త. 9:35; లూకా 9:11) అవును, అద్భుతాలు చేసేలా యేసుకు శక్తినిచ్చింది యెహోవాయే, అందుకే 'క్రీస్తు, దేవుని శక్తి' అని పౌలు చెప్పగలిగాడు. (1 కొరిం. 1:24) అయితే, యేసు చేసిన అద్భుతాల నుండి మనమేమి నేర్చుకోవచ్చు?

2 యేసు 'మహత్కార్యాలు' చేశాడని అపొస్తలుడైన పేతురు అన్నాడు. (అపొ. 2:22) ఆ 'మహత్కార్యాలను' లేదా అద్భుతాలను పరిశీలిస్తే, యేసు తన వెయ్యేళ్ల పరిపాలనలో ఏమేమి చేస్తాడో తెలుస్తుంది. అప్పుడు భూమ్మీద జీవించే మనుషులందరూ ప్రయోజనం పొందేలా ఆయన ఇంకా గొప్ప అద్భుతాలు చేస్తాడు. అంతేకాదు, యేసు చేసిన అద్భుతాలను గమనిస్తే యేసుకు, యెహోవాకు ఉన్న లక్షణాల గురించి కూడా తెలుసుకుంటాం. ఈ ఆర్టికల్‌లో, యేసు చేసిన మూడు అద్భుతాల గురించి చర్చిద్దాం. అవి ఇప్పుడూ భవిష్యత్తులోనూ మనమీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసుకుందాం.

**1.** 'క్రీస్తు, దేవుని శక్తి' అని పౌలు ఎందుకు చెప్పాడు?
**2.** యేసు చేసిన అద్భుతాల నుండి మనమేమి నేర్చుకోవచ్చు?

## మీరు వివరించగలరా?

యేసు చేసిన మొదటి అద్భుతంలో ఆయనకున్న ఏ లక్షణాలు కనిపిస్తాయి?

మత్తయి 14:14-21లో నమోదైన అద్భుతాన్ని యేసు ఎందుకు చేశాడు?

ఓ పెద్ద తుఫానును నిమ్మళింపజేయడం ద్వారా యేసు ఏమని నిరూపించుకున్నాడు?

## ఉదార స్వభావం గురించి నేర్పించే అద్భుతం

3 కానా అనే ఊరిలో జరిగిన పెళ్లిలో యేసు తన మొట్టమొదటి అద్భుతం చేశాడు. బహుశా ఎక్కువమంది రావడంవల్లో, మరేదైనా కారణం వల్లో పెళ్లిలో ద్రాక్షారసం అయిపోయింది. విందు ఏర్పాట్లన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాల్సిన బాధ్యత ఆ కొత్త జంటదే కాబట్టి, ద్రాక్షారసం అయిపోతే వాళ్లు అవమానంగా భావిస్తారు. ఆ పెళ్లికి వచ్చినవాళ్లలో యేసు తల్లి మరియ కూడా ఉంది. ఆమె యేసును సహాయం అడిగింది. ఆ సమస్యను పరిష్కరించే శక్తి యేసుకు ఉందని నమ్మబట్టే ఆమె అలా అడిగిందా? తన కుమారునికి సంబంధించిన ప్రవచనాలన్నిటినీ మరియ ఖచ్చితంగా ధ్యానించి ఉంటుంది. ఆయన "సర్వోన్నతుని కుమారుడు" అని పిలువబడతాడని కూడా ఆమెకు తెలుసు. (లూకా 1:30-32; 2:52) ఏదేమైనా మరియ, యేసు ఆ కొత్త జంటకు సహాయం చేయాలనుకున్నారు. అందుకే యేసు దాదాపు 380 లీటర్ల నీటిని అద్భుతరీతిలో 'మంచి ద్రాక్షారసంగా' మార్చాడు. (**యోహాను 2:3, 6-11 చదవండి.**) నిజానికి ఆ అద్భుతం చేయాల్సిన అవసరం ఆయనకు ఉందా? లేదు. కానీ ఆయనకు ప్రజలమీద శ్రద్ధ ఉంది కాబట్టే ఆ అద్భుతం చేసి, తన తండ్రిలాగే ఉదార స్వభావాన్ని చూపించాడు.

4 యేసు చాలామందికి సరిపోయేంత మంచి ద్రాక్షారసాన్ని అద్భుతరీతిలో అందించాడు. దీని నుండి మనమేమి నేర్చుకోవచ్చు? యెహోవాకు, యేసుకు ఉదార స్వభావం ఉందనీ, వాళ్లు ప్రజల భావాలను పట్టించుకుంటారనీ ఈ అద్భుతం చూపిస్తుంది. కొత్తలోకంలో మనం ఏ ప్రాంతంలో ఉన్నా, యెహోవా తన శక్తిని ఉపయోగించి 'సమస్త జనులకు' సమృద్ధిగా ఆహారం ఇస్తాడని కూడా అర్థమౌతుంది.—**యెషయా 25:6 చదవండి.**

5 ఒకసారి ఆలోచించండి. త్వరలో, మనకు నిజంగా అవసరమైన వాటన్నిటినీ యెహోవా ఇవ్వబోతున్నాడు. ప్రతీ ఒక్కరికి మంచి ఇల్లు, ఆహారం ఉంటాయి. పరదైసులో యెహోవా మనకు సమృద్ధిగా ఇవ్వబోయే మంచి విషయాల గురించి ఆలోచించినప్పుడు మన హృదయం కృతజ్ఞతతో నిండిపోతుంది.

6 యేసు ఎన్నడూ తన శక్తిని స్వార్థానికి ఉపయోగించుకోలేదు. రాళ్లను రొట్టెలుగా చేసుకోమని సాతాను శోధించినప్పుడు ఏమి జరిగిందో పరిశీలించండి. యేసు తన శక్తిని తన అవసరాల కోసం ఉపయోగించడానికి ఒప్పుకోలేదు. (మత్త. 4:2-4) తన శక్తిని ఇతరుల మేలు కోసం ఉపయోగించాలని ఆయన కోరుకున్నాడు. ఆయనలాగే మనమెలా నిస్వార్థ స్వభావాన్ని చూపించవచ్చు? మనం ఇచ్చే గుణాన్ని అలవాటు చేసుకోవాలని యేసు చెప్పాడు. (లూకా 6:38) ఇతరుల్ని మన ఇంటికి భోజనానికి పిలవడం ద్వారా మనమలా చేయవచ్చు. అంతేకాదు కూటాలు అయిపోయిన తర్వాత, సహోదరసహోదరీల కోసం

---

**3.** (ఎ) ఏ పరిస్థితుల్లో యేసు తన మొదటి అద్భుతాన్ని చేశాడు? (బి) ఆయన ఉదార స్వభావాన్ని ఎలా చూపించాడు?

**4, 5.** (ఎ) యేసు చేసిన మొదటి అద్భుతం నుండి మనమేమి నేర్చుకోవచ్చు? (బి) కొత్తలోకంలో ఎలాంటి పరిస్థితులు ఉంటాయని, కానాలో జరిగిన మొదటి అద్భుతం బట్టి చెప్పవచ్చు?

**6.** యేసు తన శక్తిని ఎవరి కోసం ఉపయోగించాడు? మనం ఆయన్ను ఎలా అనుకరించవచ్చు?

ఇతరుల కోసం మన సమయాన్ని ఉపయోగించినప్పుడు మనం యేసును అనుకరిస్తాం
(6వ పేరా చూడండి)



సమయం కేటాయించవచ్చు. ఉదాహరణకు, ఓ సహోదరుడు తన ప్రసంగాన్ని ప్రాక్టీసు చేస్తుంటే మనం వినవచ్చు లేదా పరిచర్యలో ఎలా మాట్లాడాలో ఇతరులకు నేర్పించవచ్చు. వీలైనప్పుడల్లా ఇతరులకు సహాయం చేయడం ద్వారా మనం యేసులా ఉదార స్వభావాన్ని చూపించవచ్చు.

## 'వారందరు తిని తృప్తిపొందారు'

7 పేదరికం కొత్త సమస్య కాదు. "బీదలు దేశములో ఉండకమానరు" అని యెహోవా ఇశ్రాయేలీయులకు చెప్పాడు. (ద్వితీ. 15:11) వందల సంవత్సరాల తర్వాత యేసు ఇలా చెప్పాడు, "బీదలెల్లప్పుడు మీతోకూడ ఉన్నారు." (మత్త. 26:11) భూమ్మీద పేదవాళ్లు ఎప్పుడూ ఉంటారని యేసు చెప్తున్నాడా? కాదు. మనం సాతాను లోకంలో జీవిస్తున్నంత కాలం పేదరికం ఉంటుందని ఆయన ఉద్దేశం. కానీ కొత్తలోకంలో పరిస్థితి అలా ఉండదు. అప్పుడిక పేదరికం అనేదే ఉండదు, అందరూ తృప్తిగా తినేంత సమృద్ధిగా ఆహారం ఉంటుంది.

8 కీర్తనకర్త యెహోవా గురించి ఇలా పాడాడు, "నీవు నీ గుప్పిలిని విప్పి ప్రతి జీవి కోరికను తృప్తి పరచుచున్నావు." (కీర్త. 145:16) తన తండ్రిని అనుకరిస్తూ, యేసు కూడా భూమ్మీద ఉన్నప్పుడు చాలా సందర్భాల్లో ఇతరుల అవసరాల్ని తీర్చాడు. కేవలం తన శక్తిని చూపించుకోవడానికి కాదుగానీ ప్రజల మీదున్న నిజమైన శ్రద్ధతో అలా చేశాడు. ఇప్పుడు మనం **మత్తయి 14:14-21** వచనాల్లో ఉన్న విషయాన్ని పరిశీలిద్దాం. (**చదవండి.**) చాలామంది ప్రజలు తమ పట్టణాల నుండి నడుచుకుంటూ యేసు దగ్గరకు వచ్చారు. (మత్త. 14:13) సాయంత్రానికల్లా శిష్యులతో సహా ప్రజలందరూ ఆకలితో ఉన్నారు. కాబట్టి, ఆకలితో నీరసించిపోయిన ప్రజల్ని ఆహారం కొనుక్కోవడానికి పంపించేయమని శిష్యులు యేసును అడిగారు. అప్పుడు యేసు ఏమి చేశాడు?

9 ఆయన ఐదు రొట్టెలు, రెండు చేపలతో వాళ్లకు ఆహారం పెట్టాడు. వాళ్లలో స్త్రీలూ పిల్లలతో సహా దాదాపు 5,000 మంది పురుషులు ఉన్నారు. ఆయన ఈ అద్భుతాన్ని ఎందుకు చేశాడు? ఎందుకంటే ఆయనకు చిన్నపిల్లలతో సహా ప్రజలందరి మీద నిజమైన ప్రేమ, శ్రద్ధ ఉన్నాయి. వాళ్లందరూ 'తిని తృప్తిపొందారు' కాబట్టి యేసు సమృద్ధిగా ఆహారం అందించి వుంటాడు. దానివల్ల వాళ్లు చాలా దూరం నడిచి తమ ఇళ్లకు తిరిగి వెళ్లగలిగారు. (లూకా 9:10-17) పైగా, అందరు తిని తృప్తి పొందిన తర్వాత శిష్యులు మిగిలిన ఆహారాన్ని 12 గంపల నిండా ఎత్తారు!

10 స్వార్థపరులైన, అవినీతిపరులైన పాలకుల వల్ల కోట్లమంది ప్రజలు పేదరికంలో మగ్గిపోతున్నారు. మన సహోదరుల్లో కూడా కొంతమంది ఆహారంలేక ఇబ్బందిపడుతున్నారు. కానీ త్వరలోనే, యెహోవాకు లోబడే ప్రజలందరూ అవినీతి, పేదరికం లేని లోకంలో జీవిస్తారు. యెహోవా సర్వశక్తిగల దేవుడు, ప్రతీఒక్కరి అవసరాల్ని తీర్చే శక్తి, తీర్చాలనే కోరిక ఆయనకున్నాయి. అతిత్వరలోనే మన బాధలన్నిటినీ పూర్తిగా తీసేస్తానని ఆయన మాటిస్తున్నాడు!—**కీర్తన 72:16 చదవండి.**

11 యేసు భూమ్మీద ఉన్నప్పుడు, కొన్ని ప్రాంతాల్లోనే అద్భుతాలు చేశాడు, అది కూడా మూడున్నర సంవత్సరాలే చేశాడు. (మత్త. 15:24) కానీ ఆయన రాజుగా పరిపాలించినప్పుడు, భూవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ సహాయం చేస్తాడు. (కీర్త. 72:8) యేసు చేసిన అద్భుతాలను గమనిస్తే, ఆయన తన శక్తిని మన ప్రయోజనం కోసం ఉపయోగించాలని కోరుకుంటున్నాడని తెలుస్తుంది. అయితే, మనకు అద్భుతాలు చేసే శక్తి లేకపోయినా, బైబిలు వాగ్దానం చేస్తున్న మంచి భవిష్యత్తు గురించి ఇతరులకు

---

**7.** మనం సాతాను లోకంలో జీవిస్తున్నంత కాలం ఏ సమస్య ఉంటుంది?

**8, 9.** (ఎ) యేసు ఎందుకు వేలమందికి ఆహారం పెట్టాడు? (బి) ఈ అద్భుతం గురించి మీకేమనిపిస్తుంది?

**10.** భవిష్యత్తులో యెహోవా పేదరికాన్ని ఏమి చేస్తాడు?

**11.** యేసు త్వరలోనే భూవ్యాప్తంగా ఉన్న ప్రజలందరి కోసం తన శక్తిని ఉపయోగిస్తాడని మీరెందుకు నమ్ముతున్నారు? కాబట్టి మీరేమి చేయాలనుకుంటున్నారు?

చెప్పడానికి మన సమయాన్ని, శక్తిని ఉపయోగించవచ్చు. యెహోవాసాక్షులముగా అది మన బాధ్యత. (రోమా. 1:14, 15) యేసు త్వరలో ఏమి చేయబోతున్నాడో ఆలోచిస్తే, వాటిగురించి ఇతరులకు ఉత్సాహంగా చెప్తాం.—కీర్త. 45:1; 49:3.

## యెహోవా, యేసు ప్రకృతి శక్తుల్ని శాసించగలరు

12 దేవుడు భూమినీ దానిమీదున్న సమస్తాన్నీ తయారు చేస్తున్నప్పుడు, యేసు ఆయన దగ్గర 'ప్రధానశిల్పిగా' పనిచేశాడు. (సామె. 8:22, 30, 31; కొలొ. 1:15-17) కాబట్టి భూమి గురించీ దాని వాతావరణం గురించీ యేసుకు పూర్తిగా తెలుసు. ప్రకృతి శక్తులన్నిటినీ ఎలా ఉపయోగించాలో, వాటిని ఎలా అదుపులో ఉంచాలో కూడా ఆయనకు తెలుసు.

13 యేసు భూమ్మీద ఉన్నప్పుడు ప్రకృతి శక్తుల్ని శాసించడం ద్వారా, తనకు దేవుడిచ్చిన శక్తి ఉందని చూపించాడు. ఉదాహరణకు, ఆయన ఓసారి తుఫానును ఎలా నిమ్మళింపజేశాడో పరిశీలించండి. (**మార్కు 4:37-39** చదవండి.) ఈ సందర్భంలో "తుఫాను" అని అనువదించబడిన గ్రీకు పదం భీకరమైన తుఫానును లేదా హరికేన్‌ను వర్ణించడానికి ఉపయోగిస్తారని ఓ బైబిలు విద్వాంసుడు వివరించాడు. కారు మబ్బులు, బలమైన ఈదురు గాలులు, ఉరుములు, కుండపోత వర్షం ఉండే తుఫానును ఆ పదం సూచిస్తుంది. అలాంటి తుఫానువల్ల అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. మత్తయి ఆ తుఫానునే "పెద్ద తుఫాను" అని వర్ణించాడు.—మత్త. 8:24, *పరిశుద్ధ బైబల్: తెలుగు ఈజీ-టు-రీడ్ వర్షన్.*

14 ఈ సన్నివేశాన్ని ఊహించుకోండి. అలలు ఎగసిపడడంతో నీళ్లు మెల్లమెల్లగా పడవలోకి చేరుతున్నాయి. ఒకవైపు ఈదురుగాలుల భీకర శబ్దం, మరోవైపు అలల తాకిడికి పడవ ఊగిపోతోంది. యేసేమో బాగా అలసిపోయి నిద్రపోతున్నాడు. కానీ శిష్యులు భయంతో ఆయన్ను నిద్రలేపి, రక్షించమని వేడుకున్నారు. (మత్త. 8:25) అప్పుడు యేసు ఏమి చేశాడు? ఆయన లేచి, "ఊరుకో! నిశ్శబ్దంగా ఉండు!" అని గాలిని, సముద్రాన్ని గద్దించాడు. (మార్కు 4:39, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) దాంతో ఆ భీకరమైన తుఫాను ఒక్కసారిగా ఆగిపోయింది, వాతావరణమంతా ప్రశాంతంగా మారిపోయింది. యేసుకు ప్రకృతిని శాసించే శక్తి ఉందని చెప్పడానికి ఇది ఓ అసాధారణమైన రుజువు కాదంటారా?

15 యేసుకు అంతటి గొప్ప శక్తిని ఇచ్చింది యెహోవాయే కాబట్టి, ఆయన కూడా ప్రకృతిని శాసించగలడు. ఉదాహరణకు, జలప్రళయానికి ముందు యెహోవా నోవహుతో ఇలా అన్నాడు, 'ఇంకో ఏడు రోజుల్లో భూమ్మీద నలభై పగళ్లు, నలభై రాత్రులు వర్షం కురిపిస్తాను.' (ఆది. 7:4, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) నిర్గమకాండము 14:21లో ఇలా ఉంది, 'యెహోవా బలమైన తూర్పుగాలిచేత సముద్రాన్ని తొలగించాడు.' యోనా 1:4 ఇలా చెప్తుంది, 'యెహోవా సముద్రం మీద పెద్దగాలి పుట్టించగా సముద్రంలో గొప్ప తుఫాను రేగి ఓడ బద్దలైపోయే గతి వచ్చింది.' భూమి పరదైసుగా మారినప్పుడు, యెహోవా ప్రకృతి శక్తుల్ని అదుపులో ఉంచుతాడని తెలుసుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుంది.

16 యెహోవాకూ యేసుకూ ప్రకృతిని శాసించే శక్తి ఉందని తెలుసుకోవడం మనకెంతో ఊరటనిస్తుంది. క్రీస్తు వెయ్యేళ్ల పరిపాలనలో భూమ్మీద జీవించేవాళ్లందరూ ఏ భయం లేకుండా ఉంటారు. తుఫానులు, సునామీలు, అగ్ని పర్వతాలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులవల్ల ఎవ్వరూ గాయపడరు, చనిపోరు. అప్పుడు "దేవుని నివాసము" మనుషులతో ఉంటుంది కాబట్టి, ఎలాంటి

**12.** ప్రకృతి గురించి యేసుకు పూర్తిగా తెలుసని మనమెందుకు నమ్మవచ్చు?

**13, 14.** యేసుకు ప్రకృతి శక్తుల్ని శాసించే శక్తి ఉందని చెప్పడానికి ఓ ఉదాహరణ ఇవ్వండి.

**15.** ప్రకృతి శక్తుల్ని అదుపు చేసే శక్తి తనకుందని యెహోవా ఎలా చూపించాడు?

**16.** యెహోవాకు, యేసుకు ప్రకృతి శక్తుల్ని శాసించే అధికారం ఉందని తెలుసుకోవడం మనకెందుకు ఊరటనిస్తుంది?



యేసు తన శక్తిని ఉపయోగించిన విధానం మీకు ఎందుకు నచ్చింది? (13, 14 పేరాలు చూడండి)

విపత్తు వస్తుందోనని భయపడాల్సిన అవసరం ఉండదు. (ప్రక. 21:3, 4) వెయ్యేళ్ల పరిపాలనలో, యెహోవా ఇచ్చే శక్తితో యేసు ప్రకృతి శక్తుల్ని శాసిస్తాడని మనం నమ్మకంతో ఉండవచ్చు.

## యెహోవాను, క్రీస్తును అనుకరించండి

17 నిజమే, ప్రకృతి విపత్తుల్ని ఆపే శక్తి మనకైతే లేదు. యెహోవా, యేసు మాత్రమే వాటిని ఆపగలరు. కానీ మనమేమి చేయవచ్చో **సామెతలు 3:27** చెప్తుంది. (**చదవండి.**) మన సహోదరసహోదరీలు కష్టాల్లో ఉన్నప్పుడు, వీలైన సహాయం చేయవచ్చు, అలాగే వాళ్ల మనసు కుదుటపడేలా ఓదార్పుకరంగా మాట్లాడవచ్చు. (సామె. 17:17) ఉదాహరణకు, ప్రకృతి విపత్తులవల్ల నష్టపోయిన వాళ్లకు చేయూతనివ్వవచ్చు. భర్తను కోల్పోయిన ఒక సహోదరి ఇల్లు ఓ పెద్ద తుఫానువల్ల బాగా పాడైంది. ఆమె ఇలా చెప్తుంది, 'యెహోవా సంస్థలో ఉన్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. సహోదరసహోదరీలు భౌతికంగానే కాదు ఆధ్యాత్మికంగా కూడా సహాయం చేశారు.' మరో ఒంటరి సహోదరి ఇల్లు, తుఫాను వల్ల దెబ్బతిన్నప్పుడు ఆమె నిరాశతో కృంగిపోయింది. సహోదరులు ఆ ఇంటిని బాగుచేసిన తర్వాత ఆమె ఇలా చెప్తుంది, 'నాకెంత సంతోషంగా ఉందో చెప్పడానికి మాటలు రావట్లేదు. యెహోవా నీకు కృతజ్ఞతలు.' మన సహోదరసహోదరీలు ఒకరి పట్ల ఒకరు శ్రద్ధ చూపిస్తున్నందుకు మనమెంతో సంతోషిస్తున్నాం. మరిముఖ్యంగా, మనపై నిజమైన శ్రద్ధ చూపిస్తున్న యెహోవాకు, యేసుకు ఎంతో రుణపడి ఉన్నాం.

18 పరిచర్యలో ఎన్నో అద్భుతాలు చేయడం ద్వారా యేసు "దేవుని శక్తి" అని నిరూపించుకున్నాడు. కానీ ఆయన ఎన్నడూ తన శక్తిని ఇతరులను మెప్పించడానికో లేదా తన స్వార్థం కోసమో ఉపయోగించలేదు. బదులుగా, ప్రజల మీదున్న నిజమైన ప్రేమతో, అద్భుతాలు చేయడానికి తన శక్తిని ఉపయోగించాడు. తర్వాతి ఆర్టికల్‌లో దాని గురించి మరిన్ని విషయాలు తెలుసుకుంటాం.

**17.** మనం యెహోవాను, క్రీస్తును ఎలా అనుకరించవచ్చు?

**18.** యేసు చేసిన అద్భుతాల్లో ప్రత్యేకత ఏమిటి?



# ఆయన ప్రజల్ని ప్రేమించాడు

*"నరులను చూచి ఆనందించుచునుంటిని."*—సామె. 8:31.

## మీరు వివరించగలరా?

మనుషుల మీద తనకెంతో ప్రేమ ఉందని యేసు ఎలా చూపించాడు?

యేసు చేసిన అద్భుతాలు మనకు భవిష్యత్తు మీద ఎలాంటి నమ్మకాన్ని కలిగిస్తాయి?

యేసు చేయబోయే ఏ అద్భుతాన్ని చూడాలని మీరు ఎదురుచూస్తున్నారు?

దేవుని మొదటి కుమారుడైన యేసు, యెహోవాకున్న అంతులేని జ్ఞానానికి గొప్ప నిదర్శనం. ఆయన తన తండ్రి దగ్గర 'ప్రధానశిల్పిగా' పని చేశాడు. తన తండ్రి "ఆకాశవిశాలమును స్థిరపరచినప్పుడు," అలాగే "భూమియొక్క పునాదులను నిర్ణయించినప్పుడు" యేసు ఎంత సంతోషించివుంటాడో ఊహించండి. అయితే, తన తండ్రి చేసిన సృష్టి అంతట్లో యేసు ముఖ్యంగా 'నరులను చూసి ఆనందించాడు.' (సామె. 8:22-31) అవును, ఆయనకు మొదటినుండి మనుషులంటే చాలా ఇష్టం.

2 తర్వాత, ఆయన ఇష్టపూర్వకంగా పరలోకాన్ని విడిచి భూమ్మీద మానవునిగా జీవించడానికి వచ్చాడు. అలా, తండ్రి పట్ల తనకున్న ప్రేమను, విశ్వసనీయతను చూపించాడు. అలాగే మనుషులందరి మీద తనకెంత ప్రేమ ఉందో కూడా చూపించాడు. తన ప్రాణాన్ని "అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా" ఇవ్వడానికి యేసు ఎంతో ప్రేమతో ముందుకొచ్చాడు. (ఫిలి. 2:5-8; మత్త. 20:28) ఆయన భూమ్మీద ఉన్నప్పుడు అద్భుతాలు చేసేలా దేవుడు ఆయనకు శక్తినిచ్చాడు. ఈ అద్భుతాల ద్వారా, తనకు ప్రజలమీద ఎంత ప్రేమ ఉందో, అతి త్వరలో మనుషులందరి కోసం తానేమి చేస్తాడో యేసు చూపించాడు.

**1, 2.** తనకు మనుషులందరి మీద చాలా ప్రేమ ఉందని యేసు ఎలా చూపించాడు?

3 భూమ్మీదకు రావడంవల్ల యేసు “దేవుని రాజ్యసువార్తను” ప్రకటించగలిగాడు. (లూకా 4:43) ఆ రాజ్యం తన తండ్రి నామాన్ని పరిశుద్ధపరుస్తుందని, మనుషుల సమస్యలన్నిటినీ శాశ్వతంగా పరిష్కరిస్తుందని యేసుకు తెలుసు. ప్రకటనా పని చేస్తున్నప్పుడు, ఆయన ఎన్నో అద్భుతాలు చేశాడు. అవి, ప్రజలందరి పట్ల యేసుకున్న శ్రద్ధను చూపించాయి. వాటి గురించి తెలుసుకోవడం ఎందుకు ప్రాముఖ్యం? ఎందుకంటే అవి మనకు భవిష్యత్తు మీద ఆశను, నమ్మకాన్ని కలిగిస్తాయి. కాబట్టి యేసు చేసిన నాలుగు అద్భుతాలను ఇప్పుడు పరిశీలిద్దాం.

## ఆయనకు స్వస్థపర్చే శక్తి ఉంది

4 యేసు పరిచర్య చేస్తూ ఓసారి గలిలయకు వెళ్లాడు. అక్కడ ఒకానొక పట్టణంలో, భయంకరమైన కుష్ఠువ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చాడు. (మార్కు 1:39, 40) ఆ వ్యాధి ఎంత తీవ్రంగా ఉందంటే, అతని ఒళ్లంతా “కుష్ఠరోగముతో నిండి” ఉందని వైద్యుడైన లూకా వర్ణించాడు. (లూకా 5:12) అతను యేసును చూసి, ‘సాగిలపడి—ప్రభువా, నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవని ఆయన్ను వేడుకున్నాడు.’ తనను బాగుచేసే శక్తి యేసుకుందని ఆ వ్యక్తికి తెలుసు. కానీ, అలా బాగుచేయాలనే **కోరిక** యేసుకు ఉందో లేదో అతను తెలుసుకోవాలనుకున్నాడు. ఎందుకు? ఎందుకంటే తనలాంటి కుష్ఠరోగుల్ని పరిసయ్యులు ఎంతగా అసహ్యించుకుంటారో అతనికి బాగా తెలుసు. మరి ఆ వ్యక్తిని చూసినప్పుడు యేసుకు ఎలా అనిపించివుంటుంది? అందవికారంగా ఉన్న ఆ వ్యక్తితో యేసు ఎలా ప్రవర్తించాడు? మీరైతే ఏమి చేసివుండేవాళ్లు?

5 ధర్మశాస్త్రం ప్రకారం, కుష్ఠరోగం ఉన్న వ్యక్తి ‘అపవిత్రుణ్ణి అపవిత్రుణ్ణి’ అని కేకలు వేయాలి. కానీ, ఆ వ్యక్తి అలా చేయలేదని అర్థమౌతోంది. (లేవీ. 13:43-46) అయినా యేసు అతన్ని కోప్పడే బదులు, అతనిమీద శ్రద్ధతో సహాయం చేయాలనుకున్నాడు. ఆ సమయంలో యేసు ఖచ్చితంగా ఏమి ఆలోచించి ఉంటాడో మనకు తెలీదు కానీ ఆయనెలా భావించాడో మనకు తెలుసు. ఆ వ్యక్తిని చూసి ఎంతో జాలిపడి, ఆయన ఓ అద్భుతం చేశాడు. ఎవ్వరూ ముట్టుకోని ఆ వ్యక్తిని ఆయన ముట్టుకున్నాడు. యేసు కనికరంతో “నాకిష్టమే; నీవు శుద్ధుడవుకమ్మని అనగానే, కుష్ఠరోగము వానిని విడిచెను.” (లూకా 5:13) యెహోవా ఇచ్చిన శక్తితో యేసు ఈ గొప్ప అద్భుతాన్ని చేసి, ప్రజలమీద తనకెంత ప్రేమ ఉందో చూపించాడు.—లూకా 5:17.

6 దేవుడిచ్చిన శక్తితో యేసు ఎన్నో అసాధారణమైన అద్భుతాలు చేశాడు. ఆయన కేవలం కుష్ఠరోగుల్నే కాదు, రకరకాల జబ్బులతో బాధపడుతున్న చాలామందిని బాగుచేశాడు. “మూగవారు మాట్లాడ్డం, వికలాంగులకు పూర్తిగా నయం కావడం, కుంటివారు నడవడం, గుడ్డివారు చూడడం” ఇవన్నీ చూసి ప్రజలు చాలా ఆశ్చర్యపోయారని బైబిలు చెప్తుంది. (మత్త. 15:31, పవిత్ర *గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) ఇప్పటి డాక్టర్లు రోగుల్ని బాగుచేయడానికి కొన్నిసార్లు అవయవ మార్పిడి చేస్తారు. కానీ, యేసు మాత్రం పాడైపోయిన అవయవాల్నే మళ్లీ బాగుచేశాడు. అంతేకాదు, ఆయన ప్రజల్ని అప్పటికప్పుడే బాగుచేశాడు, కొన్నిసార్లైతే చాలా దూరంలో ఉన్నవాళ్లను కూడా బాగుచేశాడు. (యోహా. 4:46-54) ఈ అద్భుతాలు మనకేమి తెలియజేస్తున్నాయి? అసలు జబ్బులే లేకుండా చేసే శక్తి, చేయాలనే కోరిక మన రాజైన యేసుక్రీస్తుకు ఉన్నాయని అవి తెలియజేస్తున్నాయి. యేసు ప్రజలతో ప్రవర్తించిన తీరును బట్టి, ఆయన కొత్తలోకంలో కూడా ‘నిరుపేదలమీద, బీదల

**3.** ఈ ఆర్టికల్‌లో మనమేమి పరిశీలిస్తాం?

**4.** యేసు దగ్గరికి ఓ కుష్ఠరోగి వచ్చినప్పుడు ఏమి జరిగింది?

**5.** యేసు కుష్ఠరోగిని బాగుచేసేటప్పుడు “నాకిష్టమే” అని ఎందుకు అన్నాడు?

**6.** యేసు చేసిన అద్భుతాల్లో ప్రత్యేకత ఏమిటి? ఆ అద్భుతాలు మనకేమి తెలియజేస్తున్నాయి?

మీద కనికరం’ చూపిస్తాడని నమ్మవచ్చు. (కీర్త. 72:13) అవును, అప్పుడు అనారోగ్యంతో బాధపడేవాళ్లను యేసు ఇష్టపూర్వకంగా బాగుచేస్తాడు.

## ‘లేచి నీ పరుపు ఎత్తుకుని నడువు’

7 గలిలయలో కుష్ఠురోగిని బాగుచేసిన కొన్ని నెలల తర్వాత, యేసు యూదయకు వెళ్లి, దేవుని రాజ్య సువార్తను ప్రకటించడం కొనసాగించాడు. అక్కడ వేలమంది ప్రజలు యేసు ప్రకటించిన సందేశానికి, ఆయన ప్రేమకు ముగ్ధులైవుంటారు. బీదల్ని, అణచివేయబడిన వాళ్లను ఓదార్చి, వాళ్లలో భవిష్యత్తు మీద ఆశను చిగురింపజేయాలని యేసు మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. —యెష. 61:1, 2; లూకా 4:18-21.

8 నీసాను నెలలో పస్కా పండుగను ఆచరించడానికి యేసు యెరూషలేముకు వెళ్లాడు. ఆ ప్రత్యేక పండుగను ఆచరించడానికి వచ్చిన ప్రజలతో పట్టణమంతా రద్దీగా ఉంది. యెరూషలేము ఆలయానికి ఉత్తరాన ఉన్న బేతెస్ద అనే కోనేరు దగ్గర యేసు, ఓ నడవలేని వ్యక్తికి సహాయం చేశాడు.

9 జబ్బులతో, అంగవైకల్యంతో బాధపడుతున్న చాలామంది ప్రజలు ఆ కోనేటికి వచ్చేవాళ్లు. ఎందుకు? జబ్బు ఉన్న వ్యక్తి ఆ కోనేటిలోని నీళ్లు కదులుతున్నప్పుడు అందులో దిగితే స్వస్థత పొందుతాడని వాళ్ల నమ్మకం. ఎలాగైనా స్వస్థత పొందాలని, ఆందోళన పడుతున్న చాలామంది నిస్సహాయ ప్రజలు అక్కడ ఉన్నారు. వాళ్లు ఏమి ఆలోచిస్తూ ఉండివుంటారో ఒక్కసారి ఊహించండి. పరిపూర్ణుడైన యేసుకు ఎలాంటి అనారోగ్యం లేదు, మరి ఆయనెందుకు అక్కడ ఉన్నాడు? ఆయన ప్రజలమీద ప్రేమతో అక్కడికి వెళ్లాడు. యేసు భూమ్మీద జీవించిన దానికన్నా, ఎక్కువ సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తిని యేసు అక్కడ చూశాడు. —**యోహాను 5:5-10** చదవండి.

10 యేసు అతన్ని ‘స్వస్థత పొందాలని కోరుకుంటున్నావా?’ అని అడిగాడు. స్వస్థత పొందాలని ఉన్నా, తనను కోనేటిలోకి దించేవాళ్లు ఎవరూ లేరని అతను యేసుకు చెప్పుకుంటూ ఎంత బాధపడివుంటాడో ఊహించండి. అప్పుడు యేసు ఆ వ్యక్తికి అసాధ్యమైన ఓ పనిని చేయమని అంటే లేచి తన పరుపు ఎత్తుకుని నడవమని చెప్పాడు. దాంతో అతను తన పరుపు ఎత్తుకుని నడవడం మొదలుపెట్టాడు! ఈ అద్భుతం, యేసు కొత్తలోకంలో ఏమి చేస్తాడనే దానికి ఓ చక్కని రుజువు. అంతేకాక, యేసుకు ప్రజలమీద ఎంత ప్రేమ ఉందో దీన్నిబట్టి అర్థమౌతుంది. యేసు అవసరంలో ఉన్నవాళ్ల కోసం వెదికాడు. అదేవిధంగా మన ప్రాంతంలో కూడా, లోకంలోని ఘోరమైన విషయాలను చూసి కృంగిపోయిన వాళ్ల కోసం మనం వెదుకుతూ ఉండాలి.

## ‘నా వస్త్రాలు ముట్టుకుంది ఎవరు?’

11 **మార్కు 5:25-34** చదవండి. ఓ స్త్రీ 12 ఏళ్లుగా బయటికి చెప్పుకోలేని ఓ అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. ఆ సమస్య ఆమె రోజువారీ పనులన్నిటికీ, చివరికి ఆరాధనకు కూడా ఆటంకంగా ఉండేది. ఆ వ్యాధి నయమవడం కోసం ఆమె చాలామంది వైద్యుల దగ్గరికి వెళ్లింది, తనకున్నదంతా ఖర్చుచేసింది. అయినా ఆ వ్యాధి తగ్గకపోగా ఇంకా ఎక్కువైంది. ఓ రోజు, ఆ సమస్యనుండి బయటపడే ఓ ఆలోచన ఆమెకు తట్టింది. ఆమె జనసమూహం మధ్యలో నుండి వెళ్లి యేసు వస్త్రాన్ని ముట్టుకుంది. (లేవీ. 15:19, 25) తనలో నుండి శక్తి బయటకు వెళ్లిందని గమనించిన యేసు తనను ఎవరు ముట్టుకున్నారని అడిగాడు. అప్పుడు ఆ స్త్రీ ‘భయపడి, వణుకుతూ వచ్చి, ఆయన ఎదుట సాగిలపడి, తన సంగతి అంతా ఆయనతో

**7, 8.** యూదయకు వెళ్లిన తర్వాత యేసు ఏమి చేశాడు?
**9, 10.** (ఎ) ప్రజలు బేతెస్ద కోనేటికి ఎందుకు వచ్చేవాళ్లు? (బి) ఆ కోనేరు దగ్గర యేసు ఏమి చేశాడు? దీనినుండి మనమేమి నేర్చుకోవచ్చు? (ప్రారంభ చిత్రం చూడండి.)

**11.** అనారోగ్యంతో బాధపడేవాళ్ల పట్ల యేసుకు ప్రేమ ఉందని మార్కు 5:25-34లోని వృత్తాంతం ఎలా చూపిస్తుంది?

చెప్పింది.' ఆ స్త్రీని స్వస్థపర్చింది యెహోవాయే అని గ్రహించి యేసు దయగా ఆమెతో ఇలా అన్నాడు, "కుమారీ, నీ విశ్వాసము నిన్ను స్వస్థ పరచెను, సమాధానము గలదానవై పొమ్ము; నీ బాధ నివారణయై నీకు స్వస్థత కలుగుగాక."

12 ప్రజలను, ముఖ్యంగా అనారోగ్యంతో బాధ పడేవాళ్లను యేసు ఎంతో ప్రేమిస్తాడని తెలుసు కోవడం ఊరటనిస్తుంది. అయితే సాతాను మాత్రం, మనమెందుకూ పనికిరాని వాళ్లమని, మనమీద ఎవరికీ ప్రేమ లేదని నమ్మించడానికి ప్రయత్నిస్తాడు. అయితే మన విషయంలో, మన సమస్యల విషయంలో యేసుకు నిజంగా శ్రద్ధ ఉందని ఆయన చేసిన అద్భుతాలు రుజువు చేశాయి. అలాంటి ప్రేమగల రాజు, ప్రధాన యాజకుడు మనకున్నందుకు ఎంతో రుణపడి వున్నాం. (హెబ్రీ. 4:15) చాలాకాలంగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నవాళ్ల బాధను అర్థం చేసుకోవడం మనకు కష్టం కావచ్చు, ముఖ్యంగా మనకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేనప్పుడు అది మరీ కష్టం. కానీ యేసు ఎన్నడూ అనారోగ్యంతో బాధపడకపోయినా, అలాంటి వాళ్లమీద కనికరం చూపించాడు. కాబట్టి ఆయన్ను అనుకరించడానికి శాయశక్తులా కృషి చేద్దాం.—1 పేతు. 3:8.

12. (ఎ) మనం నేర్చుకున్నదాన్ని బట్టి యేసు ఎలాంటి వ్యక్తని మీకనిపిస్తుంది? (బి) యేసు మనకెలాంటి ఆదర్శం ఉంచాడు?

## "యేసు కన్నీళ్లు విడిచెను"

13 యేసు ఇతరుల బాధల్ని చూసి చలించి పోయాడు. ఉదాహరణకు, తన స్నేహితుడైన లాజరు చనిపోయినప్పుడు ఏడుస్తున్న అతని కుటుంబ సభ్యుల్ని, స్నేహితుల్ని చూసి యేసు 'కలవరపడి, ఆత్మలో మూలిగాడు.' లాజరును మళ్లీ బ్రతికిస్తానని తెలిసి కూడా యేసు కంట తడి పెట్టుకున్నాడు. (**యోహాను 11:33-36 చదవండి.**) తాను ఏడిస్తే, చుట్టూ ఉన్నవాళ్లు

13. లాజరు పునరుత్థానం యేసు గురించి ఏమి చెప్తుంది?



మన గురించి, మన సమస్యల గురించి తనకు శ్రద్ధ ఉందని యేసు అద్భుతాలు చేయడం ద్వారా చూపించాడు
(11, 12 పేరాలు చూడండి)

ఏమనుకుంటారోనని ఆయన భయపడలేదు. యేసు లాజరును, అతని కుటుంబాన్ని ఎంతగా ప్రేమించాడంటే, దేవుని శక్తితో ఆయన లాజరును మళ్లీ బ్రతికించాడు.—యోహా. 11:43, 44.

14 యెహోవాకు ఉన్న లక్షణాలు, భావాలే యేసుకు ఉన్నాయని బైబిలు చెప్తుంది. (హెబ్రీ. 1:3, 4) కాబట్టి వ్యాధి, బాధ, మరణం లేకుండా చేయాలని యెహోవా కూడా కోరుకుంటున్నాడని యేసు చేసిన అద్భుతాలు రుజువు చేస్తున్నాయి. త్వరలోనే యెహోవా, యేసు చనిపోయిన చాలా మందిని మళ్లీ బ్రతికించబోతున్నారు. “ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు” పునరుత్థానం అవుతారని యేసు చెప్పాడు.—యోహా. 5:28, 29.

15 పునరుత్థానానికి యెహోవా జ్ఞాపకశక్తితో సంబంధం ఉంది. ఆయన సర్వశక్తిమంతుడు, విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త కాబట్టి, చనిపోయిన మన ప్రియమైనవాళ్ల లక్షణాలతో సహా, వాళ్ల వివరాలన్నిటినీ గుర్తుపెట్టుకోగలడు. (యెష. 40:26) యెహోవాకు అలా గుర్తుపెట్టుకునే **సామర్థ్యమే** కాదు, గుర్తుపెట్టుకోవాలనే **కోరిక** కూడా ఉంది. బైబిల్లో నమోదైన పునరుత్థానాలు, కొత్తలోకంలో ఏమి జరగబోతోందో మనకు తెలియజేస్తాయి.

## యేసు చేసిన అద్భుతాల నుండి మనమేమి నేర్చుకోవచ్చు?

16 మనం చివరి వరకూ నమ్మకంగా ఉంటే, మహాశ్రమల్ని తప్పించుకోవచ్చు. అది మనం చూడగల గొప్ప అద్భుతాల్లో ఒకటి. హార్‌మెగిద్దోను ముగిసిన వెంటనే, మనం మరిన్ని అద్భుతాలు చూస్తాం. అప్పుడు ప్రతీ ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. (యెష. 33:24; 35:5, 6; ప్రక. 21:4) ఒకసారి ఊహించుకోండి, ఎవ్వరూ ఇక కళ్లద్దాలను, చేతికర్రలను, చక్రాల కుర్చీలను, చెవిటి మిషన్లను ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. హార్‌మెగిద్దోనును తప్పించుకున్నవాళ్లకు యెహోవా పూర్తి ఆరోగ్యాన్ని ఇస్తాడు. ఎందుకంటే, అప్పుడు చేయాల్సిన పని చాలా ఉంటుంది, వాళ్లు భూమిని అందమైన పరదైసుగా మార్చాలి.—కీర్త. 115:16.

17 యేసు చేసిన స్వస్థతల గురించి బైబిల్లో చదివినప్పుడు, ‘గొప్ప సమూహానికి’ చెందిన వాళ్లు ఊరట పొందుతారు. (ప్రక. 7:9) యేసు భవిష్యత్తులో అనారోగ్యాన్ని పూర్తిగా తీసేస్తాడనే వాళ్ల నమ్మకాన్ని ఆ అద్భుతాలు బలపరుస్తాయి. అంతేకాక, దేవుని మొదటి కుమారుడైన యేసుకు మనుషుల మీద ఎంత ప్రేముందో కూడా అవి చూపిస్తాయి. (యోహా. 10:11; 15:12, 13) యేసు చూపించిన గొప్ప కనికరం, యెహోవాకు తన సేవకుల్లో ప్రతీఒక్కరి పట్ల ఉన్న ప్రేమను చక్కగా ప్రతిబింబిస్తుంది.—యోహా. 5:19.

18 ఇప్పుడు లోకంలో ఎటు చూసినా బాధలు, కష్టాలు, చావులే ఉన్నాయి. (రోమా. 8:22) అందుకే దేవుడు తీసుకొచ్చే కొత్తలోకం మనకు అవసరం. ఆ కొత్తలోకంలో అందరూ దేవుడు వాగ్దానం చేసినట్లు పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. అపరిపూర్ణతలన్నీ పోవడంవల్ల మనం సంతోషంగా, ఉత్సాహంగా ‘గంతులు వేస్తూ’ ఉంటామని మలాకీ 4:2 చెప్తుంది. మనం యెహోవాపట్ల కృతజ్ఞత కలిగి ఉంటూ, ఆయన వాగ్దానాల మీద విశ్వాసం ఉంచాలి. అప్పుడే, కొత్తలోకంలో ఉండేలా అర్హత సాధించడానికి శాయశక్తులా కృషి చేస్తాం. యేసు చేసిన అద్భుతాలు, ఆయన తన పరిపాలనలో మనందరి శాశ్వత ప్రయోజనం కోసం చేయబోయేవాటికి సూచనగా ఉన్నాయని తెలుసుకోవడం ఎంత ప్రోత్సాహకరం!

**14, 15.** (ఎ) మానవజాతి సమస్యలన్నిటినీ తీసివేయాలనే కోరిక యెహోవాకు ఉందని ఎలా చెప్పవచ్చు? (బి) పునరుత్థానానికి యెహోవా జ్ఞాపకశక్తితో ఎలాంటి సంబంధం ఉంది?

**16.** చాలామంది దేవుని సేవకులకు ఏ అవకాశం ఉంటుంది?

**17, 18.** (ఎ) యేసు ఎందుకు అద్భుతాలు చేశాడు? (బి) కొత్తలోకంలో ఉండడానికి మనమెందుకు శాయశక్తులా కృషి చేయాలి?



# మనం పవిత్రంగా ఉండగలం

*‘మీ చేతులు శుభ్రం చేసుకోండి, మీ హృదయాలు పవిత్రం చేసుకోండి.’*
*—యాకో. 4:8, పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం.*

పవిత్రంగా ఉండడానికి ఈ లేఖనాలు మనకెలా సహాయం చేస్తాయి?

యాకోబు 1:14, 15

యాకోబు 4:8

యాకోబు 5:13-15

నైతికంగా దిగజారిపోయిన లోకంలో మనం జీవిస్తున్నాం. సలింగ సంయోగం, అక్రమ సంబంధాలు వంటివి పెద్ద తప్పేమీ కాదని చాలా మంది ప్రజలు అనుకుంటున్నారు. సినిమాలు, పుస్తకాలు, పాటలు, వాణిజ్య ప్రకటనలు వంటివి అనైతికతతో నిండిపోతున్నాయి. (కీర్త. 12:8) అయితే, ఇలాంటి పరిస్థితుల మధ్య కూడా మనం తనను సంతోషపెట్టే విధంగా జీవించడానికి యెహోవా సహాయం చేయగలడు. అవును, ఈ అనైతిక లోకంలో కూడా మనం పవిత్రంగా ఉండగలం.—**1 థెస్సలొనీకయులు 4:3-5 చదవండి.**

2 మనం యెహోవాను సంతోషపెట్టాలంటే, ఆయన అసహ్యించుకునే ప్రతీదానికి దూరంగా ఉండాలి. అయితే, చేపలకు ఎర ఆకర్షణీయంగా కనిపించినట్టే అపరిపూర్ణులమైన మనకు కూడా అనైతికత ఆకర్షణీయంగా కనిపించవచ్చు. మనలో ఏవైనా తప్పుడు కోరికలు మొలకెత్తితే వాటిని మొదట్లోనే తుంచేయాలి. అలా చేయకపోతే ఆ కోరికలు మరింత బలపడి, అవకాశం దొరికినప్పుడు మనం తప్పు చేసే ప్రమాదం ఉంది. అందుకే,

**1.** చాలామంది ప్రజలు ఏమనుకుంటున్నారు?

**2, 3.** (ఎ) తప్పుడు కోరికలు మొలకెత్తకుండా ఎందుకు చూసుకోవాలి? (బి) ఈ ఆర్టికల్‌లో మనమేమి చర్చిస్తాం?

‘దురాశ గర్భం ధరించి పాపాన్ని కంటుంది’ అని బైబిలు చెప్తుంది.—**యాకోబు 1:14, 15 చదవండి.**

3 తప్పుడు కోరికలు మన హృదయంలో మొదలౌతాయి. కాబట్టి మన హృదయంలో ఎలాంటి కోరికలు మొలకెత్తుతున్నాయో చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. తప్పుడు కోరికలు మొలకెత్తిన వెంటనే వాటిని తీసేసుకుంటే మనం వ్యభిచారానికి, దానివల్ల వచ్చే చెడు ఫలితాలకు దూరంగా ఉండగలుగుతాం. (గల. 5:16) తప్పుడు కోరికలతో పోరాడడానికి మనకు సహాయం చేసే మూడు విషయాల గురించి ఈ ఆర్టికల్‌లో చర్చిస్తాం. అవేమిటంటే, యెహోవాతో స్నేహం, దేవుని వాక్యంలోని సలహాలు, పరిణతి గల తోటి క్రైస్తవుల సహాయం.

## ‘దేవుని దగ్గరకు రండి’

4 దేవునికి దగ్గరవ్వాలనుకునే వాళ్లకు బైబిలు ఇలా చెప్తుంది, ‘మీ చేతులు శుభ్రం చేసుకోండి, మీ హృదయాలు పవిత్రం చేసుకోండి.’ (యాకో. 4:8, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) యెహోవాను మన స్నేహితునిగా భావిస్తే, మన పనులే కాదు ఆలోచనలు కూడా ఆయన్ని సంతోషపెట్టే విధంగా ఉండాలని కోరుకుంటాం. మన ఆలోచనలు పరిశుద్ధంగా, పవిత్రంగా ఉంటే హృదయం కూడా పవిత్రంగా ఉంటుంది. (కీర్త. 24:3, 4; 51:6; ఫిలి. 4:8) నిజమే, మనం అపరిపూర్ణులం కాబట్టి మనలో తప్పుడు కోరికలు మొదలవ్వవచ్చని యెహోవా అర్థం చేసుకుంటాడు. కానీ మనం ఆయనను బాధపెట్టాలనుకోం కాబట్టి వాటిని తీసేసుకోవడానికి చేయగలిగినదంతా చేస్తాం. (ఆది. 6:5, 6) మన ఆలోచనలను పవిత్రంగా ఉంచుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తాం.

5 మనం తప్పుడు కోరికలతో పోరాడాలంటే సహాయం కోసం యెహోవాకు ప్రార్థిస్తూ ఉండాలి. ఆయన పరిశుద్ధాత్మ ద్వారా, మనం పవిత్రంగా ఉండడానికి కావాల్సిన బలాన్ని ఇస్తాడు. మన ఆలోచనలు తనను సంతోషపెట్టేలా ఉండాలని కోరుకుంటున్నామని మనం ప్రార్థనలో ఆయనకు చెప్పవచ్చు. (కీర్త. 19:14) అంతేకాదు, పాపం చేయడానికి దారితీసే తప్పుడు కోరికలు మనలో ఉన్నాయేమో పరిశీలించమని యెహోవాను వినయంగా అడగాలి. (కీర్త. 139:23, 24) కాబట్టి, అనైతికతకు దూరంగా ఉండేలా, శోధనలు ఎదురైనా సరైనది చేసేలా సహాయం చేయమని మనం యెహోవాను అడుగుతూనే ఉండాలి. —మత్త. 6:13.

6 సత్యం తెలుసుకోకముందు, బహుశా మనం యెహోవాకు నచ్చని పనులను ఇష్టపడి ఉంటాం. ఆ తప్పుడు కోరికల నుండి బయటపడడానికి మనం ఇప్పటికీ పోరాడుతుండవచ్చు. అయినప్పటికీ, మన ప్రవర్తన మార్చుకుని, తనకు ఇష్టమైన విధంగా జీవించేలా యెహోవా సహాయం చేయగలడు. ఉదాహరణకు, రాజైన దావీదు బత్షెబతో వ్యభిచారం చేసిన తర్వాత ఎంతో పశ్చాత్తాపపడి, తనకు “పవిత్ర హృదయాన్ని” కలుగజేయమని, విధేయత చూపించేలా సహాయం చేయమని దేవున్ని వేడుకున్నాడు. (కీర్త. 51:10, 12, *పరిశుద్ధ బైబల్: తెలుగు ఈజీ-టు-రీడ్ వర్షన్*) కాబట్టి గతంలో మనకున్న బలమైన తప్పుడు కోరికలతో ఒకవేళ ఇప్పటికీ పోరాడుతుంటే యెహోవా మనకు సహాయం చేయగలడు. ఆయనకు విధేయత చూపిస్తూ, సరైనదే చేయాలనే మరింత బలమైన కోరికను ఆయన మనలో కలిగించగలడు. చెడు ఆలోచనలను అదుపులో పెట్టుకోవడానికి యెహోవా మనకు సహాయం చేయగలడు.—కీర్త. 119:133.

## ‘వాక్యప్రకారం ప్రవర్తించండి’

7 సహాయం కోసం మనం చేసే ప్రార్థనలకు యెహోవా తన వాక్యమైన బైబిలు ద్వారా

**4.** యెహోవాను స్నేహితునిగా భావిస్తే మనమేమి చేస్తాం?
**5, 6.** తప్పుడు కోరికల నుండి బయటపడడానికి ప్రార్థన మనకెలా సహాయం చేస్తుంది?

**7.** తప్పుడు ఆలోచనలకు దూరంగా ఉండడానికి దేవుని వాక్యం మనకెలా సహాయం చేస్తుంది?



హృదయంలో ఏదైనా తప్పుడు కోరిక మొలకెత్తితే, దాన్ని వెంటనే తీసేసుకోవాలి

(6వ పేరా చూడండి)

జవాబిస్తాడు. ఆయన వాక్యంలో ఉన్న జ్ఞానం “పవిత్రమైనది.” (యాకో. 3:17) కాబట్టి, మనం ప్రతిరోజు బైబిలు చదివినప్పుడు, మన మనసును పవిత్రమైన ఆలోచనలతో నింపుకుంటాం. (కీర్త. 19:7, 11; 119:9, 11) అంతేకాదు బైబిల్లో ఉన్న ఉదాహరణలు, సలహాలు మనం తప్పుడు ఆలోచనలకు, కోరికలకు దూరంగా ఉండడానికి సహాయం చేస్తాయి.

8 అనైతికతకు దూరంగా ఉండమని సామెతలు 5:8 మనల్ని హెచ్చరిస్తుంది. ఆ హెచ్చరికను నిర్లక్ష్యం చేయడం వల్ల వచ్చే ప్రమాదాన్ని సామెతలు 7వ అధ్యాయంలోని వృత్తాంతంలో చదువుతాం. ఆ వృత్తాంతంలోని యువకుడు రాత్రిపూట ఓ వేశ్య ఉంటున్న ఇంటి వైపుగా వెళ్లాడు. ఆ స్త్రీ “వేశ్యావేషము వేసికొని” వీధి చివర నిలబడివుంది. ఆమె అతన్ని పట్టుకుని, ముద్దుపెట్టుకుని, కవ్వించే మాటలతో అతనిలో కోరికల్ని రేపింది. తన కోరికల్ని అదుపులో పెట్టుకోకపోవడం వల్ల ఆ యువకుడు ఆమెతో వ్యభిచారం చేశాడు. బహుశా అతను తప్పు చేయాలనే ఉద్దేశంతో అటు వెళ్లకపోయినా చివరికి తప్పు చేశాడు, దానివల్ల ఘోరమైన ఫలితాలు అనుభవించాడు. పొంచి ఉన్న ప్రమాదాన్ని పసిగట్టి ఉంటే, ఆ యువకుడు ఆమె నుండి దూరంగా పారిపోయేవాడే.—సామె. 7:6-27.

---

**8, 9.** (ఎ) సామెతలు 7వ అధ్యాయంలో ప్రస్తావించబడిన యువకుడు ఎందుకు వ్యభిచారం చేశాడు? (బి) మనం ఎలాంటి పరిస్థితులకు దూరంగా ఉండాలని ఆ ఉదాహరణ తెలియజేస్తుంది?

9 ఆ యువకునిలాగే, మనం కూడా ప్రమాదాన్ని పసిగట్టలేకపోవడం వల్ల కొన్నిసార్లు శోధనలో చిక్కుకోవచ్చు. ఉదాహరణకు, కొన్ని టీవీ ఛానళ్లు రాత్రిపూట అశ్లీల కార్యక్రమాలను ప్రసారం చేస్తాయి. కాబట్టి, అలాంటి సమయాల్లో ఊరికే ఛానళ్లు మారుస్తూ ఉండడం ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడమే. అలాగే ఇంటర్నెట్ వాడేటప్పుడు స్క్రీన్ మీద కనపడే ప్రతీ లింక్‌ను తెరచి చూడడం కూడా ప్రమాదకరమే. అంతేకాదు అశ్లీల ప్రకటనలు, అశ్లీల చిత్రాలు ఉండే ఛాట్‌రూమ్‌లు లేదా వెబ్‌సైట్లను ఉపయోగించడం వల్ల ఉచ్చుల్లో చిక్కుకుంటాం. ఎందుకంటే, మనం చూసే ప్రకటనలు, చిత్రాలు మనలో కోరికల్ని రేకెత్తించి చివరికి యెహోవా చేయవద్దన్న పనిని చేసేలా మనల్ని నడిపిస్తాయి.

10 స్త్రీపురుషులు ఒకరితోఒకరు ఎలా ప్రవర్తించాలో కూడా దేవుని వాక్యం చెప్తుంది. (**1 తిమోతి 5:2 చదవండి.**) క్రైస్తవులు తమ భర్త/భార్యతో లేదా పెళ్లి చేసుకోబోయే వ్యక్తితో తప్ప ఇతరులతో చనువుగా ఉండరు, సరసాలాడరు. కానీ కొంతమంది మాత్రం, అవతలి వ్యక్తిని ముట్టుకోనంత వరకూ, శరీర కదలికలతో లేదా హావభావాలతో, చూపులతో రెచ్చగొట్టడం తప్పేమీకాదని అనుకోవచ్చు. కానీ ఇద్దరు వ్యక్తులు సరసాలాడడం మొదలుపెట్టిన క్షణం నుండే వాళ్లలో తప్పుడు ఆలోచనలు మొలకెత్తవచ్చు. అది చివరికి వ్యభిచారానికి దారితీయవచ్చు. గతంలో అలా జరిగింది కాబట్టి, ఇప్పుడు కూడా జరిగే అవకాశం ఉంది.

11 నైతిక విషయాల్లో యోసేపు మనకు మంచి ఆదర్శం. తన కోరిక తీర్చమని పోతీఫరు భార్య యోసేపును బలవంతపెట్టింది. ఆయన ఎంత నిరాకరించినా ఆమె మాత్రం కవ్విస్తూనే ఉంది. తనతో ఉండమని ఆయన్ని ప్రతీరోజు అడిగేది. (ఆది. 39:7, 8, 10) ఒకవేళ యోసేపు తనతో ఏకాంతంగా ఉంటే తనను కోరుకుంటాడని ఆమె అనుకుని ఉండవచ్చని ఓ బైబిలు విద్వాంసుడు అన్నాడు. అయితే యోసేపు మాత్రం ఆమె తీపి మాటలకు లొంగకూడదని నిశ్చయించుకున్నాడు, ఆయన ఏరోజూ ఆమెతో చనువుగా ప్రవర్తించలేదు. అలా ఆయన తన హృదయంలోకి తప్పుడు కోరికల్ని రానివ్వలేదు. ఆఖరికి ఆమె యోసేపు వస్త్రాన్ని పట్టుకుని, బలవంతపెట్టినప్పుడు కూడా ఆయన వెంటనే 'తన వస్త్రాన్ని ఆమె చేతిలో విడిచిపెట్టి తప్పించుకొని బయటికి పారిపోయాడు.'—ఆది. 39:12.

12 మనం చూసే విషయాలు మన హృదయంలో తప్పుడు కోరికల్ని రేకెత్తించవచ్చని యేసు హెచ్చరించాడు. 'ఒక స్త్రీని మోహపు చూపుతో చూసే ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారం చేసినవాడవుతాడు' అని ఆయన అన్నాడు. (మత్త. 5:28) రాజైన దావీదు విషయంలో అదే జరిగింది. ఆయన మిద్దె మీద నడుస్తున్నప్పుడు, స్నానం చేస్తున్న ఓ స్త్రీని చూశాడు. ఆయన తన చూపును తిప్పుకోకుండా ఆమెనే చూస్తూ, ఆమె గురించే ఆలోచించాడు. (2 సమూ. 11:2) ఆమె ఇంకొకరి భార్య అయినా, దావీదు ఆమె మీద మోజుపడి చివరికి వ్యభిచారం చేశాడు.

13 తప్పుడు ఆలోచనలతో పోరాడి గెలవాలంటే, మనం కూడా యోబులా 'మన కళ్లతో నిబంధన' చేసుకోవాలి. (యోబు 31:1, 7, 9) ఎన్నడూ ఇతరులను తప్పుడు ఉద్దేశంతో చూడకూడదని మనం నిర్ణయించుకోవాలి. కంప్యూటర్‌లోగానీ, పోస్టర్ల మీదగానీ, పుస్తకాల మీదగానీ లేదా మరెక్కడైనా అశ్లీల చిత్రం కనిపిస్తే వెంటనే చూపు తిప్పేసుకోవాలి.

14 ఇప్పటివరకు మనం పరిశీలించిన వాటిలో, మీరు దేనిలోనైనా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తిస్తే, వెంటనే మార్పులు చేసుకోండి. దేవుని వాక్యంలోని సలహాలను ఇష్టంగా

---

**10.** ఇతరులతో సరసాలాడడం ఎందుకు ప్రమాదకరం? (ప్రారంభ చిత్రం చూడండి.)

**11.** యోసేపు నుండి మనం ఏ పాఠం నేర్చుకోవచ్చు?

**12.** మనం చూసే విషయాలు మన హృదయం మీద ప్రభావం చూపిస్తాయని ఎలా చెప్పవచ్చు?

**13.** మన కళ్లతో ఎందుకు "నిబంధన" చేసుకోవాలి? ఎలా చేసుకోవాలి?

**14.** పవిత్రంగా ఉండాలంటే మనమేమి చేయాలి?

పాటిస్తే, మీరు అనైతికతకు దూరంగా ఉంటూ పవిత్రంగా ఉండగలుగుతారు.—**యాకోబు 1:21-25** చదవండి.

## సంఘపెద్దల సహాయం తీసుకోండి

15 ఒకవేళ చెడు కోరికలతో పోరాడడం మీకు కష్టంగా ఉంటే, ఎంతోకాలంగా యెహోవాను సేవిస్తూ, దేవుని వాక్యం నుండి మంచి సలహా ఇవ్వగల తోటిక్రైస్తవుల సహాయం తీసుకోండి. నిజమే, వ్యక్తిగత విషయాల గురించి ఇతరులతో మాట్లాడడం కొంచెం కష్టంగానే ఉంటుంది. అయినప్పటికీ ఇతరుల సహాయం తీసుకోవడం చాలా ప్రాముఖ్యం. (సామె. 18:1; హెబ్రీ. 3:12-14) ఎలాంటి మార్పులు చేసుకోవాలో మీరు గుర్తించేలా పరిణతిగల క్రైస్తవులు సహాయం చేయగలుగుతారు. మీరు వెంటనే ఆ మార్పులు చేసుకుంటే, యెహోవాతో మీకున్న స్నేహాన్ని కాపాడుకోగలుగుతారు.

16 ముఖ్యంగా సంఘపెద్దలు అలాంటి సహాయం చేయగలరు. (**యాకోబు 5:13-15** చదవండి.) బ్రెజిల్‌కు చెందిన ఓ యువకుడు చాలా సంవత్సరాలపాటు తప్పుడు కోరికలతో సతమతమయ్యాడు. అతనిలా అంటున్నాడు, "నా ఆలోచనలు యెహోవాను బాధపెడుతున్నాయని నాకు తెలుసు. కానీ నా సమస్య గురించి ఇతరులతో చెప్పడానికి చాలా సిగ్గనిపించింది." అతని సమస్యను అర్థం చేసుకున్న ఓ పెద్ద అతనికి సహాయం అవసరమని గుర్తించి, సంఘపెద్దల సహాయం తీసుకోమని అతన్ని ప్రోత్సహించాడు. ఆ యువకుడు ఇలా అంటున్నాడు, "సంఘపెద్దలు నాతో దయగా వ్యవహరించిన తీరును చూసి నేను ఆశ్చర్యపోయాను. నేను అనుకున్న దానికన్నా నామీద ఎక్కువ దయ చూపించి, నన్ను బాగా అర్థం చేసుకున్నారు. నా సమస్య గురించి చెప్తున్నప్పుడు వాళ్లు శ్రద్ధగా విన్నారు. యెహోవా నన్ను ఇంకా ప్రేమిస్తున్నాడని బైబిలు ద్వారా భరోసా ఇచ్చి, నాతో కలిసి ప్రార్థించారు. వీటన్నిటివల్ల వాళ్లిచ్చిన లేఖనాధారిత సలహాను పాటించడం నాకు తేలికైంది." యెహోవాతో తన స్నేహాన్ని బలపర్చుకున్న తర్వాత ఆ యువకుడు ఇలా చెప్తున్నాడు, 'సమస్యలతో ఒంటరిగా సతమతమవ్వడం కన్నా, పెద్దల సహాయం తీసుకోవడం ఎంత ముఖ్యమో నాకిప్పుడు అర్థమైంది.'

17 మీకు అశ్లీల చిత్రాలను చూసే అలవాటు ఉంటే, వెంటనే సంఘపెద్దల సహాయం తీసుకోండి. మీరు ఆలస్యం చేసేకొద్దీ, లైంగిక అనైతికతకు పాల్పడే ప్రమాదం మరింత ఎక్కువౌతుంది. దానివల్ల మీరు ఇతరుల్ని బాధపెట్టడమే కాక, యెహోవాకు చెడ్డపేరు తీసుకొస్తారు. అయితే, యెహోవాను సంతోషపెట్టాలని, సంఘంలోనే ఎప్పటికీ ఉండాలని కోరుకున్న చాలామంది, పెద్దల సహాయం అడిగి, వాళ్లిచ్చిన సలహాలను పాటించారు.—యాకో. 1:15; కీర్త. 141:5; హెబ్రీ. 12:5, 6.

## పవిత్రంగా ఉండాలని నిశ్చయించుకోండి

18 సాతాను లోకం రోజురోజుకీ నైతికంగా దిగజారిపోతోంది. కానీ యెహోవా సేవకులు మాత్రం తమ ఆలోచనలను పవిత్రంగా ఉంచుకుంటూ, దేవుని నైతిక ప్రమాణాల ప్రకారం జీవించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. వాళ్లను చూసి యెహోవా ఎంతో గర్వపడుతున్నాడు. కాబట్టి యెహోవాకు సన్నిహితంగా ఉంటూ, ఆయన తన వాక్యమైన బైబిలు ద్వారా, సంఘం ద్వారా ఇచ్చే సలహాలను పాటించాలని నిశ్చయించుకుందాం. అలా చేసినప్పుడు, నిర్మలమైన మనస్సాక్షితో సంతోషంగా ఉంటాం. (కీర్త. 119:5, 6) అంతేకాదు, భవిష్యత్తులో సాతాను నాశనమయ్యాక దేవుని పరిశుభ్రమైన కొత్తలోకంలో నిత్యం జీవిస్తాం.

---

**15.** తప్పుడు కోరికలతో పోరాడడం కష్టంగా ఉంటే, ఇతరుల సహాయం తీసుకోవడం ఎందుకు ముఖ్యం?

**16, 17.** (ఎ) తప్పుడు కోరికలతో పోరాడుతున్నవాళ్లకు సంఘపెద్దలు ఎలా సహాయం చేస్తారు? ఓ అనుభవం చెప్పండి. (బి) అశ్లీల చిత్రాలు చూసే అలవాటు ఉన్నవాళ్లు వెంటనే పెద్దల సహాయం ఎందుకు తీసుకోవాలి?

**18.** మీరేమని నిశ్చయించుకున్నారు?

# “కింగ్స్లీ చేయగలిగాడంటే నేనూ చేయగలను!”

తన భుజాన్ని ఓ సహోదరుడు తట్టగానే కింగ్స్లీ చదవడం మొదలుపెట్టాడు. ఆ రోజు దైవపరిపాలనా పరిచర్య పాఠశాలలో, ఆయన మొదటిసారి బైబిల్ రీడింగ్ చేస్తున్నాడు. ప్రతీ పదాన్ని జాగ్రత్తగా పలుకుతూ, ఒక్క పొల్లు కూడా పోకుండా చదువుతున్నాడు. కానీ చదివేటప్పుడు ఆయన బైబిలు చూడట్లేదు. ఎందుకని?

శ్రీలంకకు చెందిన కింగ్స్లీకి చూపులేదు, సరిగ్గా వినిపించదు కూడా, ఎక్కడికి వెళ్లాలన్నా చక్రాల కుర్చీలోనే వెళ్లాలి. అలాంటి వ్యక్తి యెహోవా గురించి నేర్చుకుని, దైవపరిపాలనా పరిచర్య పాఠశాలలో ఎలా రీడింగ్ చేయగలిగాడో తెలుసుకోవాలని ఉందా?

నేను కింగ్స్లీని మొదటిసారి కలిసినప్పుడు, సత్యంపట్ల ఆయనకున్న ఆసక్తిని చూసి ఆశ్చర్యపోయాను. గతంలో కొంతమంది సాక్షులు ఆయనతో స్టడీ చేశారు. ఆయన దగ్గర బ్రెయిలీలో ఉన్న నిత్యజీవమునకు నడుపు సత్యము అనే పుస్తకం బాగా పాతదైపోయింది.* నేను ఆయన్ని, ‘మళ్లీ స్టడీ తీసుకుంటారా’ అని అడిగినప్పుడు సంతోషంగా ఒప్పుకున్నాడు. కానీ మా ముందు రెండు సవాళ్లున్నాయి.

మొదటిది, ఆయన వృద్ధులూ వికలాంగులూ ఉండే ఆశ్రమంలో ఉంటున్నాడు. అక్కడంతా గోలగా ఉండడంవల్ల, ఆయనకు సరిగ్గా వినిపించకపోవడంవల్ల నేను గట్టిగా మాట్లాడాల్సి వచ్చేది. దాంతో, మేము స్టడీలో చర్చించుకునే విషయాలు ఆశ్రమంలోని వాళ్లందరికీ వినబడేవి.

రెండో సమస్య ఏంటంటే, కింగ్స్లీ స్టడీలో ఎక్కువ సమాచారాన్ని చదవలేడు, ఏవైనా కొత్త విషయాలు చర్చిస్తే వాటిలో

* ఆ పుస్తకాన్ని 1995లో ప్రచురించారు, కానీ ఇప్పుడు ప్రింట్ చేయడం లేదు.





కింగ్స్లీ, పాల్

కొన్నిమాత్రమే అర్థం చేసుకోగలిగేవాడు. అయితే, స్టడీ నుండి ఎక్కువ ప్రయోజనం పొందడం కోసం కింగ్స్లీ చాలా కష్టపడే వాడు. స్టడీ చేయబోయే పాఠాన్ని ముందుగానే చాలాసార్లు చదివేవాడు, తన బ్రెయిలీ బైబిల్లో లేఖనాలు తీసి చూసేవాడు. ఆ తర్వాత ప్రశ్నలకు జవాబులను తన మనసులోనే సిద్ధపడే వాడు. ఈ పద్ధతి బాగా పనిచేసింది. స్టడీ జరిగేటప్పుడు ఆయన ఒక కార్పెట్ మీద కూర్చుని, నేలను చరుస్తూ, నేర్చుకుంటున్న విషయాల్ని పెద్ద గొంతుతో ఉత్సాహంగా చెప్పేవాడు. కొంతకాలానికే, మేము స్టడీ కోసం వారానికి రెండుసార్లు కలుసుకోవడం మొదలుపెట్టాం. ప్రతీసారి రెండు గంటలపాటు స్టడీ జరిగేది.

## మీటింగ్స్‌కి రావడం, వాటిలో పాల్గొనడం

మీటింగ్స్‌కి రావాలని కింగ్స్లీ ఎంతో ఆరాటపడేవాడు. కానీ అది అంత తేలిక కాదు. ఆయన్ని రాజ్యమందిరానికి తీసుకెళ్లడం కోసం చక్రాల కుర్చీలో, కారులో కూర్చోబెట్ట డానికీ దించడానికీ ఎవరోఒకరి సహాయం అవసరమయ్యేది. సంఘంలో చాలామంది వంతులవారీగా ఆయనకు సహాయం చేసేవాళ్లు, నిజానికి సహోదరులు దాన్ని గొప్ప అవకాశంగా భావించేవాళ్లు. కూటాలు జరిగేటప్పుడు కింగ్స్లీ సౌండ్ బాక్సు పక్కనే కూర్చుని శ్రద్ధగా వినేవాడు, వ్యాఖ్యానాలు కూడా ఇచ్చేవాడు!

కొంతకాలం స్టడీ తీసుకున్న తర్వాత ఆయన దైవపరి పాలనా పరిచర్య పాఠశాలలో చేరాడు. తన నియామకా నికి ఇంకా రెండు వారాలు ఉందనగా నేను ఆయన్ని, 'బైబిలు రీడింగ్ ప్రాక్టీసు చేస్తున్నారా' అని అడిగాను. దానికి ఆయనెంతో ధీమాగా, "అవును బ్రదర్, సుమారు 30 సార్లు ప్రాక్టీసు చేశాను" అని చెప్పాడు. ఆయన చేస్తున్న కృషిని మెచ్చుకుని, ఒకసారి చదవమని అడిగాను. ఆయన తన బ్రెయిలీ బైబిలు తెరచి, లేఖనాలను చదవడం మొదలు పెట్టాడు. ఆయన చదవడం అయితే చదువుతున్నాడు కానీ లేఖనాలపై తన వ్రేళ్లను ఎప్పటిలా కదపడంలేదని నేను గమనించాను. అంటే, ఆయన చదవాల్సిన లేఖనాలన్నిటినీ కంఠస్థం చేసేశాడు!

అది చూసి నా కన్నీళ్లు ఆగలేదు, నా కళ్లను నేను నమ్మ లేకపోయాను. కేవలం 30 సార్లే చదివి లేఖనాలన్నీ అంత బాగా ఎలా గుర్తుపెట్టుకున్నారని కింగ్స్లీని అడిగాను. దానికి ఆయన, "**రోజుకు** 30 సార్లు చదివాను" అని చెప్పాడు. దాదాపు ఓ నెలపాటు, ఆయన అలవాటుగా తన కార్పెట్ మీద కూర్చుని ఆ లేఖనాలన్నీ కంఠస్థం వచ్చేదాకా పదేపదే చదు వుతూనే ఉన్నాడు.

కింగ్స్లీ బైబిల్ రీడింగ్ చేయాల్సిన రోజు రానేవచ్చింది. ఆయన చదవడం అయిపోగానే రాజ్యమందిరమంతా చప్పట్లతో మారుమ్రోగిపోయింది. ఆయన పట్టుదల చూసి చాలామంది సహోదరసహోదరీలు ఆనందంతో కంటతడి పెట్టుకున్నారు. పాఠశాలలో విద్యార్థి ప్రసంగాలు ఇవ్వడానికి భయపడే ఒక ప్రచారకురాలు, కింగ్స్లీని చూశాక మళ్లీ వాటిని చేయడానికి ముందుకొచ్చింది. కారణమేంటని అడిగినప్పుడు, "కింగ్స్లీ చేయగలిగాడంటే నేనూ చేయగలను!" అని ఆమె చెప్పింది.

మూడు సంవత్సరాలపాటు బైబిలు స్టడీ చేశాక కింగ్స్లీ యెహోవాకు సమర్పించుకుని, 2008 సెప్టెంబరు 6న బాప్తిస్మం తీసుకున్నాడు. 2014, మే 13న చనిపోయేదాకా యెహోవాకు యథార్థంగా ఉన్న కింగ్స్లీ, తాను భూపరదై సులో పూర్తి బలంతో, ఆరోగ్యంతో తన సేవను కొనసాగిస్తానని నమ్మాడు. (యెష. 35:5, 6)—పాల్ మెక్ మానెస్ చెప్పినది.



# మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవించండి
## మొదటి భాగం

*“నీ నామము పరిశుద్ధపరచబడు గాక.”*—మత్త. 6:9, 10.

### మీరు గుర్తుచేసుకోగలరా?

“మా తండ్రీ” అనే మాట మనకు ఏ విషయాన్ని గుర్తుచేస్తుంది?

దేవుని పేరు పరిశుద్ధపర్చబడాలని మనమెందుకు ప్రార్థించాలి?

దేవుని చిత్తం భూమ్మీద నెరవేరాలని ప్రార్థించడం మాత్రమే సరిపోతుందా? వివరించండి.

**మత్తయి** 6:9-13 వచనాల్లో ఉన్న యేసు నేర్పించిన ప్రార్థన గురించి చాలామందికి తెలుసు. మనం కూడా ఇంటింటి పరిచర్యలో, దేవుని రాజ్యం ఈ భూమిని పరదైసుగా మార్చే ఓ నిజమైన ప్రభుత్వమని చెప్పడానికి ఆ వచనాల్నే ఉపయోగిస్తాం. అలాగే, “నీ నామము పరిశుద్ధపరచబడు గాక” అనే మాటల్ని చూపించి, దేవునికి ఒక పేరు ఉందనీ ఆ పేరును మనం పరిశుద్ధంగా ఎంచాలనీ వివరిస్తాం.—మత్త. 6:9, 10.

2 మనం ప్రార్థించే ప్రతీసారి మాదిరి ప్రార్థనలోని మాటల్నే ఉపయోగించాలని యేసు చెప్తున్నాడా? లేదు, మనం ప్రార్థన చేసేటప్పుడు చెప్పిన మాటల్నే మళ్లీమళ్లీ చెప్పొద్దని యేసు అన్నాడు. (మత్త. 6:7) యేసు మరో సందర్భంలో తన శిష్యులకు ప్రార్థించడం నేర్పించినప్పుడు, అదే ప్రార్థనను చేశాడు కానీ వేరే పదాలు ఉపయోగించాడు. (లూకా 11:1-4)

**1.** మత్తయి 6:9-13 వచనాల్లో ఉన్న మాదిరి ప్రార్థనను మనం పరిచర్యలో ఎలా ఉపయోగిస్తాం?

**2.** మనం ప్రార్థించే ప్రతీసారి మాదిరి ప్రార్థనలోని మాటల్నే ఉపయోగించాలన్నది యేసు ఉద్దేశం కాదని ఎలా చెప్పవచ్చు?

కాబట్టి, మనం ఎలాంటి విషయాల గురించి ప్రార్థించవచ్చో నేర్పించడానికే యేసు మాదిరి ప్రార్థనను నేర్పించాడు.

3 యేసు నేర్పించిన మాదిరి ప్రార్థనలోని విషయాలను ఈ ఆర్టికల్‌లో, తర్వాతి ఆర్టికల్‌లో చర్చిస్తాం. అలా పరిశీలిస్తున్నప్పుడు, 'నా ప్రార్థనలను మెరుగుపర్చుకోవడానికి మాదిరి ప్రార్థన ఎలా సహాయం చేస్తుంది?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మరిముఖ్యంగా 'నేను మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవిస్తున్నానా?' అని ఆలోచించండి.

## "పరలోకమందున్న మా తండ్రీ"

4 "మా తండ్రీ" అనే మాటతో యేసు ప్రార్థన మొదలుపెట్టాడు. ఆ మాట, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మన సహోదరసహోదరీలందరికీ యెహోవాయే తండ్రి అని మనకు గుర్తుచేస్తుంది. (1 పేతు. 2:17) పరలోక నిరీక్షణ ఉన్నవాళ్లను యెహోవా తన 'పిల్లలుగా' దత్తత తీసుకున్నాడు, కాబట్టి ఆయన వాళ్లకు ఓ ప్రత్యేక భావంలో తండ్రి అవుతాడు. (రోమా. 8:15-17) అలాగే, భూనిరీక్షణ ఉన్నవాళ్లు కూడా యెహోవాను "తండ్రి" అని పిలవవచ్చు. ఎందుకంటే యెహోవా వాళ్లకు జీవాన్ని ఇచ్చి, ప్రేమతో వాళ్ల అవసరాలను తీరుస్తున్నాడు. అయితే వాళ్లు పరిపూర్ణులై, చివరి పరీక్షలో కూడా యెహోవాకు నమ్మకంగా ఉన్నామని నిరూపించుకున్న తర్వాత వాళ్లు పూర్తిస్థాయిలో "దేవుని పిల్లలు" అవుతారు. —రోమా. 8:20, 21; ప్రక. 20:7, 8.

5 తల్లిదండ్రులు తమ పిల్లలకు, యెహోవా మన ప్రియమైన పరలోక తండ్రి అనీ ఆయనకు ప్రార్థించాలనీ నేర్పించాలి. అలా చేసే తల్లిదండ్రులు తమ పిల్లలకు ఓ మంచి బహుమానాన్ని ఇస్తున్నట్టే. దక్షిణ ఆఫ్రికాలో ప్రాంతీయ పర్యవేక్షకునిగా సేవచేస్తున్న ఓ సహోదరుడు ఇలా చెప్తున్నాడు, 'మా కూతుళ్లు పుట్టిన మొదటి రోజు నుంచి నేను రోజూ రాత్రి వాళ్లతో కలిసి ప్రార్థిస్తూ వచ్చాను. నేను ఊర్లో లేకపోతే తప్ప రోజూ అలా చేసేవాణ్ణి. అయితే, ఆ ప్రార్థనల్లో నేను ఖచ్చితంగా ఏ పదాలు ఉపయోగించేవాణ్ణో గుర్తులేదని వాళ్లు అంటుంటారు. కానీ ఎంత గౌరవంగా యెహోవాకు ప్రార్థించేవాళ్లమో, ప్రార్థనల వల్ల ప్రశాంతంగా, సురక్షితంగా ఉన్నట్లు ఎలా భావించేవాళ్లమో వాళ్లు గుర్తుచేసుకుంటారు. వాళ్లు కాస్త ఎదిగిన తర్వాత, బిగ్గరగా ప్రార్థించమని వాళ్లను ప్రోత్సహించాను. వాళ్లు తమ ఆలోచనల్ని, భావాల్ని యెహోవాకు చెప్పుకుంటుంటే వినేవాణ్ణి, అలా వాళ్ల మనసుల్లో ఏముందో తెలుసుకునేవాణ్ణి. నెమ్మదినెమ్మదిగా, మాదిరి ప్రార్థనలో ఉన్న ముఖ్యమైన అంశాల్ని కూడా తమ ప్రార్థనల్లో చేర్చేలా వాళ్లకు సహాయం చేశాను. అలా వాళ్లు సరైన విధంగా ప్రార్థించడం నేర్చుకున్నారు.'

6 ఆయన కూతుళ్లు పెరిగి పెద్దయ్యేకొద్దీ, యెహోవాకు మరింత దగ్గరయ్యారు. వాళ్లు పెళ్లి చేసుకుని, తమ భర్తలతో కలిసి సంతోషంగా పూర్తికాల సేవ చేస్తున్నారు. తల్లిదండ్రులారా, యెహోవా ఓ నిజమైన వ్యక్తి అనీ, ఆయనతో స్నేహం చేయవచ్చనీ మీ పిల్లలకు నేర్పించండి. మీరు మీ పిల్లలకు ఇవ్వగల అతి పెద్ద బహుమతి అదే. అయితే, యెహోవాతో ఉన్న స్నేహాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాత్రం పిల్లలదే. —కీర్త. 5:11, 12; 91:14.

## "నీ నామము పరిశుద్ధపరచబడు గాక"

7 దేవుని పేరు తెలుసుకుని, ఆయన 'నామం కొరకు ఒక జనముగా' ఉండే గొప్ప గౌరవం మనకుంది. (అపో. 15:14; యెష. 43:10) యెహోవా

---

**3.** మాదిరి ప్రార్థన గురించి చర్చిస్తుండగా, మనం ఏ ప్రశ్నల గురించి ఆలోచించాలి?

**4.** "మా తండ్రీ" అనే మాట మనకు ఏ విషయాన్ని గుర్తుచేస్తుంది? యెహోవా మనకు ఏ భావంలో తండ్రి అవుతాడు?

**5, 6.** తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇవ్వగల శ్రేష్ఠమైన బహుమతి ఏమిటి? మరి పిల్లల బాధ్యత ఏమిటి? (ప్రారంభ చిత్రం చూడండి.)

**7.** మనకు ఏ గొప్ప గౌరవం ఉంది? అయితే, మనమేమి చేయాలి?

‘నామం పరిశుద్ధపర్చబడాలని’ మనం ప్రార్థిస్తాం. ఆయన నామానికి చెడ్డపేరు తీసుకొచ్చే పనులకు, మాటలకు దూరంగా ఉండేలా మనకు సహాయం చేయమని కూడా వేడుకుంటాం. అయితే మనం మొదటి శతాబ్దంలోని కొంతమందిలా ఉండకూడదు. వాళ్లు ఇతరులకు బోధించారేగానీ వాటిని పాటించలేదు. అందుకే పౌలు వాళ్లకు ఇలా రాశాడు, ‘మీ వల్లే కదా దేవుని నామం అన్యజనుల మధ్య దూషించబడుతుంది?’—రోమా. 2:21-24.

8 యెహోవా నామానికి ఘనత తీసుకురావడానికి మనం చేయగలిగినదంతా చేస్తాం. నార్వేకు చెందిన ఓ సహోదరి భర్త చనిపోవడంతో, ఆమె ఒంటరిగానే తమ రెండేళ్ల కొడుకును పెంచింది. ఆమె ఇలా చెప్తుంది, ‘అది నా జీవితంలో చాలా కష్టకాలం. నేను ప్రతీరోజు, దాదాపు గంటగంటకూ ప్రార్థించేదాన్ని. నేను ఏదైనా తప్పుడు నిర్ణయం తీసుకున్నా లేదా తప్పు చేసినా సాతాను యెహోవాను నిందిస్తాడు, కాబట్టి సాతానుకు ఆ అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు నాకు సరిగ్గా ఆలోచించే సామర్థ్యాన్ని ఇవ్వమని ప్రార్థనలో అడిగేదాన్ని. నేను యెహోవా నామాన్ని పరిశుద్ధపర్చాలని కోరుకున్నాను, అంతేకాదు పరదైసులో మా అబ్బాయి వాళ్ల నాన్నను కలుసుకోవాలన్నది నా కోరిక.’—సామె. 27:11.

9 మరి, యెహోవా ఆమె ప్రార్థనలకు జవాబిచ్చాడా? ఇచ్చాడు. తోటి సహోదరసహోదరీలతో ఎక్కువగా సమయం గడపడం వల్ల ఆమె ప్రోత్సాహం పొందింది. ఐదేళ్ల తర్వాత, ఆమె ఓ సంఘపెద్దను పెళ్లి చేసుకుంది. ఆ అబ్బాయికి ఇప్పుడు 20 ఏళ్లు, అతను బాప్తిస్మం తీసుకున్న ప్రచారకునిగా సేవచేస్తున్నాడు. ఆమె ఇలా అంటోంది, ‘మా అబ్బాయిని సరిగ్గా పెంచడంలో నా భర్త సహాయం చేశాడు, అందుకు నాకెంతో సంతోషంగా ఉంది.’

**8, 9.** తన నామాన్ని పరిశుద్ధపర్చాలని కోరుకునేవాళ్లకు యెహోవా ఎలా సహాయం చేస్తాడో ఓ అనుభవం చెప్పండి.

10 తన నామానికి చెడ్డపేరు తీసుకొస్తూ, తన సర్వాధిపత్యాన్ని వ్యతిరేకించే వాళ్లందరినీ నాశనం చేసినప్పుడు యెహోవా తన నామాన్ని పరిశుద్ధపర్చుకుంటాడు. (**యెహెజ్కేలు 38:22, 23 చదవండి.**) అప్పుడు మనుషులు క్రమంగా పరిపూర్ణులౌతారు, పరలోకంలోనూ భూమ్మీదా జీవించేవాళ్లందరూ యెహోవానే ఆరాధిస్తారు. అలా అందరూ యెహోవా నామాన్ని పరిశుద్ధపర్చే రోజు కోసం మనం ఎంతో ఎదురుచూస్తున్నాం. అప్పుడు, మన ప్రేమగల తండ్రి అందరికీ సర్వస్వం అవుతాడు.—1 కొరిం. 15:28.

## “నీ రాజ్యము వచ్చుగాక”

11 యేసు పరలోకానికి వెళ్లేముందు శిష్యులు, ‘ప్రభువా, ఈ కాలమందు ఇశ్రాయేలుకు రాజ్యాన్ని మళ్లీ అనుగ్రహిస్తావా?’ అని ఆయన్ని అడిగారు. అయితే దేవుని రాజ్య పరిపాలన ఎప్పుడు మొదలౌతుందో వాళ్లు తెలుసుకోవడానికి అది సమయం కాదని యేసు అన్నాడు. బదులుగా, ప్రాముఖ్యమైన ప్రకటనా పని మీద దృష్టి పెట్టమని వాళ్లకు చెప్పాడు. (**అపొస్తలుల కార్యములు 1:6-8 చదవండి.**) దాంతోపాటు, దేవుని రాజ్యం రావాలని ప్రార్థించమని, దాని కోసం ఎదురుచూడమని కూడా యేసు వాళ్లకు చెప్పాడు. అందుకే దేవుని రాజ్యం రావాలని మనం ఇప్పటికీ ప్రార్థిస్తున్నాం.

12 యేసు పరలోకంలో రాజయ్యే సమయం దగ్గరపడుతుండగా, అది ఎప్పుడు జరుగుతుందో గ్రహించడానికి యెహోవా తన ప్రజలకు సహాయం చేశాడు. 1876లో ఛార్లెస్ తేజ్ రస్సెల్, “అన్యజనముల కాలములు: అవి ఎప్పుడు ముగుస్తాయి?” అనే ఆర్టికల్ రాశాడు. దానియేలు ప్రవచనంలోని “ఏడు కాలములు,” యేసు చెప్పిన ప్రవచనంలోని “అన్యజనముల

**10.** యెహోవా తన నామాన్ని ఎప్పుడు పూర్తిగా పరిశుద్ధపర్చుకుంటాడు?

**11, 12.** తన ప్రజలు 1876లో ఏ విషయాన్ని అర్థం చేసుకునేలా యెహోవా సహాయం చేశాడు?





దేవుని చిత్తం చేసేలా మీ పిల్లలకు నేర్పిస్తున్నారా?
(16వ పేరా చూడండి)

కాలములు" ఒకటేనని, అవి 1914లో ముగుస్తాయని ఆ ఆర్టికల్‌లో వివరించాడు.*—దాని. 4:16; లూకా 21:24.

13 యూరప్‌లో 1914లో మొదలైన యుద్ధం, కొంతకాలానికే ప్రపంచ యుద్ధంగా మారింది. దానివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరువులు వచ్చాయి. 1918లో ఆ యుద్ధం ముగిసే సమయానికి, ఓ ప్రాణాంతకమైన ఫ్లూ వ్యాధి ప్రబలింది. యుద్ధంలో చనిపోయినవాళ్లకన్నా ఆ వ్యాధివల్ల చనిపోయినవాళ్లే ఎక్కువ. ఇవన్నీ యేసు 1914లో రాజయ్యాడని నిరూపించే 'సూచనలో' భాగమే. (మత్త. 24:3-8; లూకా 21:10, 11) ఆ సంవత్సరంలో ఆయన 'జయించుచు, జయించుటకు బయలువెళ్లాడు.' (ప్రక. 6:2) ఆయన సాతానును, అతని దయ్యాలను పరలోకంనుండి భూమ్మీదకు పడేశాడు. అప్పటినుండి, "భూమీ, సముద్రమా, మీకు శ్రమ; అపవాది తనకు సమయము కొంచెమే అని తెలిసికొని బహు క్రోధముగలవాడై మీయొద్దకు దిగివచ్చియున్నాడు" అనే మాటలు నెరవేరడం చూస్తున్నాం.—ప్రక. 12:7-12.

14 యేసు పరలోకంలో రాజైనప్పటినుండి భూమ్మీద పరిస్థితులు ఎందుకు ఘోరంగా తయారౌతున్నాయో, ప్రకటన 12:7-12 వచనాలు వివరిస్తున్నాయి. యేసు పరలోకంలో పరిపాలించడం మొదలుపెట్టినా ఈ లోకం మాత్రం ఇంకా

* ఆ ప్రవచనం 1914లో నెరవేరిందని ఎలా చెప్పవచ్చో తెలుసుకోవడానికి, *బైబిలు నిజంగా ఏమి బోధిస్తోంది?* పుస్తకంలోని 215-218 పేజీలు చూడండి.

**13.** ఏ సంఘటన 1914లో జరిగింది? అప్పటినుండి ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలు ఏ విషయాన్ని రుజువు చేస్తున్నాయి?

**14.** (ఎ) దేవుని రాజ్యం రావాలని ఎందుకు ప్రార్థిస్తూనే ఉండాలి? (బి) ఇప్పుడు మనం చేయాల్సిన ప్రాముఖ్యమైన పని ఏమిటి?

సాతాను గుప్పిట్లోనే ఉంది. కానీ త్వరలోనే యేసు భూమ్మీదున్న చెడుతనాన్ని తీసేసి, తన జైత్రయాత్రను ముగిస్తాడు. అప్పటివరకు మనం దేవుని రాజ్యం రావాలని ప్రార్థిస్తూ, రాజ్యం గురించి ప్రకటిస్తూ ఉందాం. మనం చేస్తున్న ప్రకటనా పని యేసు చెప్పిన ఈ ప్రవచనాన్ని నెరవేరుస్తుంది, "ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటుతరువాత అంతము వచ్చును." —మత్త. 24:14.

## 'నీ చిత్తం భూమిమీద నెరవేరును గాక'

15 సుమారు 6,000 సంవత్సరాల క్రితం భూమ్మీద దేవుని చిత్తం జరుగుతూ ఉండేది. అందుకే తాను చేసిన ప్రతీదీ "చాలమంచిదిగా" ఉందని యెహోవా చెప్పాడు. (ఆది. 1:31) అయితే, సాతాను తిరుగుబాటు చేసిన దగ్గరనుండి, చాలామంది ప్రజలు దేవుని చిత్తం చేయడం మానేశారు. కానీ ఇప్పుడు దాదాపు 80 లక్షలమంది యెహోవా దేవున్ని సేవిస్తున్నారు. వాళ్లు దేవుని చిత్తం భూమ్మీద నెరవేరాలని ***ప్రార్థిస్తున్నారు,*** దానికి తగ్గట్లు ***జీవిస్తున్నారు*** కూడా. వాళ్లు దేవున్ని సంతోషపెట్టేలా జీవిస్తూ, దేవుని రాజ్యం గురించి ఇతరులకు ఉత్సాహంగా ప్రకటిస్తారు.

16 ఉదాహరణకు, 1948లో బాప్తిస్మం తీసుకుని ఆఫ్రికాలో మిషనరీగా సేవ చేసిన 80 ఏళ్ల ఓ సహోదరి ఇలా అంటోంది, 'మరీ ఆలస్యం కాకముందే, గొర్రెల్లాంటి ప్రజలందరూ సువార్త వినాలని, వాళ్లు యెహోవా గురించి తెలుసుకోవాలని నేను తరచూ ప్రార్థిస్తాను. అలాగే నేను ఓ వ్యక్తికి సాక్ష్యం ఇచ్చే ముందు, అతని హృదయాన్ని చేరుకునేలా ప్రకటించడానికి జ్ఞానం ఇవ్వమని కూడా ప్రార్థిస్తాను. ఇప్పటికే సువార్తను అంగీకరించిన వాళ్లకు సహాయం చేయడం కోసం చేస్తున్న ప్రయత్నాలను ఆశీర్వదించమని ప్రార్థిస్తాను.' ఈ సహోదరి యెహోవాను తెలుసుకోవడానికి చాలామందికి సహాయం చేసింది. ఆమెలాగే యెహోవా చిత్తాన్ని ఉత్సాహంగా చేస్తున్న వృద్ధ సహోదరసహోదరీల గురించి ఆలోచించండి. —**ఫిలిప్పీయులు 2:17** చదవండి.

17 ఈ భూమ్మీదున్న తన శత్రువులందర్నీ యెహోవా నాశనం చేసేంతవరకు, మనం ఆయన చిత్తం నెరవేరాలని ప్రార్థిస్తూనే ఉంటాం. అప్పుడు ఈ భూమంతా పరదైసుగా మారుతుంది, చనిపోయిన కోట్లాదిమంది మళ్లీ బతుకుతారు. "ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని" బయటికి వస్తారని యేసు చెప్పాడు. (యోహా. 5:28, 29) చనిపోయిన మన ప్రియమైన వాళ్లను మళ్లీ కలుసుకున్నప్పుడు ఎంత సంతోషంగా ఉంటుందో ఊహించండి. దేవుడు మన కన్నీళ్లను తుడిచేస్తాడు. (ప్రక. 21:4) పునరుత్థానమైన వాళ్లలో ఎక్కువమంది 'అనీతిమంతులే' ఉంటారు, అంటే యెహోవా గురించీ యేసుక్రీస్తు గురించీ తెలుసుకోకుండా చనిపోయినవాళ్లే ఉంటారు. వాళ్లకు దేవుని చిత్తం గురించి సంతోషంగా నేర్పిస్తూ వాళ్లు 'నిత్యజీవం' పొందేలా మనం సహాయం చేస్తాం. —అపో. 24:14, 15; యోహా. 17:3.

18 మానవజాతికి కావాల్సిన మూడు ముఖ్యమైన విషయాలు: దేవుని నామం పరిశుద్ధపర్చబడడం, ఆయన రాజ్యం రావడం, విశ్వంలో ఉన్నవాళ్లందరూ యెహోవాను ఐక్యంగా ఆరాధించడం. యేసు నేర్పించిన మాదిరి ప్రార్థనలోని మొదటి మూడు విన్నపాలు ఇవే. యెహోవా ఈ మూడు విన్నపాలకు జవాబిచ్చినప్పుడు, ఆ ముఖ్యమైన విషయాలను నెరవేరుస్తాడు. తర్వాతి ఆర్టికల్‌లో, యేసు నేర్పించిన మాదిరి ప్రార్థనలోని మిగతా విన్నపాలను చర్చిస్తాం.

---

**15, 16.** దేవుని చిత్తం భూమ్మీద నెరవేరాలని ప్రార్థించడం మాత్రమే సరిపోతుందా? వివరించండి.

**17.** దేవుడు మనుషుల విషయంలో, భూమి విషయంలో ఏమి చేయబోతున్నాడు? దాని గురించి మీకేమనిపిస్తుంది?

**18.** మానవజాతికి కావాల్సిన ముఖ్యమైన విషయాలు ఏమిటి?



# మాదిరి ప్రార్థనకు అనుగుణంగా జీవించండి

## రెండవ భాగం

*“మీకేం కావాలో మీ తండ్రికి తెలుసు.”*
*—మత్త. 6:8, పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం.*

### మీకు గుర్తున్నాయా?

“మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము” అనే మాటల అర్థం ఏమిటి?

యెహోవా మన ‘రుణాలు క్షమించాలంటే’ మనమేమి చేయాలి?

‘మమ్మల్ని శోధనలోకి తీసుకురావద్దు’ అని మనం చేసే విన్నపానికి యెహోవా ఏవిధంగా జవాబిస్తాడు?

**తన రెండు** ప్రార్థనలకు యెహోవా జవాబిచ్చిన ఆ రోజును లానా ఎప్పటికీ మర్చిపోదు. ఆమె 2012 వేసవిలో జర్మనీలో ఉన్నప్పుడు ఓ రోజు రెండు విషయాల గురించి ప్రార్థించింది. మొదటిది, ఆమె ట్రైన్‌లో ఎయిర్‌పోర్ట్‌కు ప్రయాణిస్తూ, ఎవరికైనా సాక్ష్యం ఇచ్చే అవకాశాన్ని ఇవ్వమని యెహోవాకు ప్రార్థించింది. అయితే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాక, ఆమె వెళ్లాల్సిన విమానం ఒకరోజు ఆలస్యమని తెలిసింది. ఆమె దగ్గర ఎక్కువ డబ్బులు లేకపోవడంతో, ఆ రాత్రి ఎక్కడ తలదాచుకోవాలో ఆమెకు అర్థంకాలేదు. కాబట్టి ఈ విషయంలో సహాయం చేయమని ఆమె యెహోవాకు ప్రార్థించింది.

2 లానా అలా ప్రార్థించిందో లేదో, “హలో లానా! నువ్వేంటి ఇక్కడున్నావ్?” అనే మాటలు వినిపించాయి. ఎవరా అని చూస్తే, తనతోపాటు స్కూల్లో చదువుకున్న ఓ యువకుడు. అతను దక్షిణాఫ్రికా వెళ్తున్నాడు, అందుకని వీడ్కోలు చెప్పడానికి అతని అమ్మ, అమ్మమ్మ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చారు. లానా తన పరిస్థితి గురించి చెప్పినప్పుడు, ఆమెను తమ ఇంటికి ఆహ్వానించారు. ఇంటికెళ్లిన తర్వాత, వాళ్లు ఆమె నమ్మకాల గురించి, ఆమె చేస్తున్న పయినీరు సేవ గురించి ఎన్నో ప్రశ్నలు అడిగారు.

---

**1-3.** తనకేమి కావాలో యెహోవాకు తెలుసని ఓ సహోదరి ఎందుకు భావించింది?

3 తర్వాతి రోజు టిఫిన్ చేశాక, వాళ్లు అడిగిన మరికొన్ని బైబిలు ప్రశ్నలకు లానా జవాబిచ్చింది. యెహోవాసాక్షులు వాళ్లను మళ్లీ కలిసేందుకు వీలుగా వాళ్ల చిరునామా, ఫోన్ నెంబరు అడిగి తీసుకుంది. ఆ తర్వాత, ఆమె తన స్వదేశానికి క్షేమంగా తిరిగొచ్చి పయినీరు సేవను కొనసాగిస్తోంది. యెహోవా తన ప్రార్థనలకు జవాబిచ్చాడని, తనకేమి కావాలో తెలుసుకుని సహాయం చేశాడని ఆమె భావిస్తోంది.—కీర్త. 65:2.

4 అనుకోకుండా మనకేదైనా సమస్య వస్తే సహాయం కోసం యెహోవాకు ప్రార్థిస్తాం. తన సేవకుల ప్రార్థనలు వినడం ఆయనకు ఎంతో ఇష్టం. (కీర్త. 34:15; సామె. 15:8) అయితే, మనం ప్రార్థించాల్సిన మరింత ముఖ్యమైన విషయాలు ఉన్నాయని మాదిరి ప్రార్థన చూపిస్తుంది. అందులోని చివరి నాలుగు విన్నపాలు, మనం యెహోవాకు నమ్మకంగా ఉండడానికి ఎలా సహాయం చేస్తాయో ఈ ఆర్టికల్‌లో చర్చిద్దాం.—**మత్తయి 6:11-13** చదవండి.

## "మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము"

5 మనం ప్రార్థించేటప్పుడు, "నా అనుదినాహారము" కోసం కాకుండా "మా అనుదినాహారము" కోసం అడగాలని యేసు నేర్పించాడు. ఆఫ్రికాలో ప్రాంతీయ పర్యవేక్షకునిగా సేవ చేస్తున్న విక్టర్ ఇలా చెప్తున్నాడు, 'రేపు మా భోజనం సంగతేంటి, ఇంటి అద్దె ఎలా కట్టాలి అనే వాటి గురించి నేనూ, నా భార్య దిగులుపడాల్సిన అవసరం లేనందుకు యెహోవాకు తరచూ కృతజ్ఞతలు చెప్తుంటాను. సహోదరులు ఎంతో దయతో ప్రతీరోజు మా అవసరాలను తీరుస్తున్నారు. అయితే వాళ్లకు వచ్చే ఆర్థిక ఒత్తిళ్లను సరిగ్గా ఎదుర్కొనేలా సహాయం చేయమని నేను యెహోవాకు ప్రార్థిస్తుంటాను.'

6 మనకైతే ఆహారానికి ఎలాంటి లోటూ లేకపోవచ్చు కానీ మన సహోదరులు చాలామంది పేదరికంలో మగ్గుతున్నారు, విపత్తుల వల్ల బాధపడుతున్నారు. మనం వాళ్ల గురించి ప్రార్థించడమే కాకుండా వీలైన సహాయం కూడా చేయవచ్చు. ఉదాహరణకు, మన దగ్గరున్న వస్తువులను అవసరంలో ఉన్న తోటి సహోదరసహోదరీలకు ఇవ్వవచ్చు. అలాగే, ప్రపంచవ్యాప్త పనికోసం క్రమంగా కొంత విరాళం ఇవ్వవచ్చు. మనమిచ్చే ఆ విరాళాలు అవసరంలో ఉన్న మన సహోదరసహోదరీలకు ఉపయోగపడతాయి.—1 యోహా. 3:17.

7 "అనుదినాహారము" గురించి ప్రార్థించమని చెప్పినప్పుడు, యేసు మన రోజువారీ అవసరాల గురించి మాట్లాడుతున్నాడు. అందుకే ఆయనిలా చెప్పాడు, 'అల్ప విశ్వాసం ఉన్నవారలారా, అడవిగడ్డినే దేవుడు ఇంతగా అలంకరిస్తే, మరి నిశ్చయంగా మీకు వస్త్రాలు ఇస్తాడు కదా. కనుక ఏం బట్టలు వేసుకొంటామో? అని చింతించకండి.' ఆ తర్వాత మళ్లీ ఇలా చెప్పాడు, 'రేపటి గురించి చింతించకండి.' (మత్త. 6:30-34, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) కాబట్టి మనం రేపటి గురించి అతిగా చింతించకుండా, ఏరోజుకారోజు మన కనీస అవసరాలు తీరుతున్నందుకు మనం తృప్తిపడాలి. కాబట్టి కనీస అవసరాల కోసం అంటే ఉండడానికి ఓ ఇల్లు, కుటుంబాన్ని పోషించుకోవడానికి ఏదైనా పని, ఆరోగ్యం విషయంలో సరైన నిర్ణయాలు తీసుకునే జ్ఞానం కోసం మనం యెహోవాకు ప్రార్థించవచ్చు. కానీ మనం ప్రార్థించాల్సిన అంతకన్నా ముఖ్యమైన అవసరాలు ఉన్నాయి.

8 మన అనుదినాహారము గురించి యేసు చెప్పిన మాటలు, మనకు ఆధ్యాత్మిక ఆహారం అవసరమని కూడా గుర్తుచేయాలి. "మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాటవలనను జీవించును" అని ఆయన అన్నాడు. (మత్త. 4:4) కాబట్టి, యెహోవా మనకు తగినవేళ ఆధ్యాత్మిక ఆహారం అందిస్తూ ఉండాలని మనం ప్రార్థించాలి.

## 'మా ఋణాలు క్షమించుము'

9 యేసు తన మాదిరి ప్రార్థనలో, 'మా ఋణాలు క్షమించుము' అని ప్రార్థించమని నేర్పించాడు.

---

**4.** ఈ ఆర్టికల్‌లో ఏమి చర్చిస్తాం?

**5, 6.** మనకు ఆహారానికి ఏ లోటూ లేకపోయినా "మా అనుదినాహారము" దయచేయమని ప్రార్థించాలని యేసు ఎందుకు చెప్పాడు?

**7.** రేపటి గురించి చింతించవద్దని యేసు ఎలా వివరించాడు?

**8.** మన అనుదినాహారము గురించి యేసు చెప్పిన మాటలు ఏ విషయాన్ని మనకు గుర్తుచేయాలి? (ప్రారంభ చిత్రం చూడండి.)

**9.** మన పాపాల్ని అప్పులతో ఎందుకు పోల్చవచ్చు?

అయితే మరో సందర్భంలో, "మా పాపములను క్షమించుము" అని ప్రార్థించమని చెప్పాడు. (మత్త. 6:12; లూకా 11:4) మన పాపాల్ని రుణాలతో లేదా అప్పులతో పోల్చవచ్చు. 1951లో కావలికోట పత్రిక ఇలా వివరించింది: మనం యెహోవా ఆజ్ఞలను పాటిస్తూ ఆయన పట్ల ప్రేమ చూపించాలి. కానీ మనం యెహోవాకు వ్యతిరేకంగా పాపం చేసినప్పుడు, ఆయనకు న్యాయంగా ఇవ్వాల్సిన విధేయతను, ప్రేమను ఇవ్వలేకపోతాం. ఆ విధంగా, మనం పాపం చేసినప్పుడు యెహోవాకు అప్పుపడతాం. కావాలనుకుంటే యెహోవా మనతో ఉన్న స్నేహాన్ని తెంచేసుకోగలడు. ఆ కావలికోట ఇంకా ఇలా చెప్పింది, "పాపం చేయడమంటే యెహోవా మీద ప్రేమ లేకపోవడమే."—1 యోహా. 5:3.

10 అందుకే, మన పాపాల్ని క్షమించడం కోసం యేసును బలిగా అర్పించినందుకు మనం యెహోవాకు ఎంతో కృతజ్ఞులం. మనకు యెహోవా క్షమాపణ ప్రతీరోజు అవసరం. యేసు చనిపోయి దాదాపు 2,000 సంవత్సరాలైనా, ఆయన బలి ద్వారా వచ్చిన ప్రయోజనాల్ని మనం ఈరోజు కూడా అనుభవిస్తున్నాం. ఇంతటి అమూల్యమైన బహుమతి ఇచ్చినందుకు మనం యెహోవాకు ఎల్లప్పుడూ కృతజ్ఞతలు చెప్పాలి. మన "ప్రాణవిమోచన ధనము" ఎంత గొప్పదంటే దాన్ని మనలో ఎవ్వరం ఎప్పటికీ చెల్లించగలిగేవాళ్లం కాదు. (**కీర్తన 49:7-9; 1 పేతురు 1:18, 19** చదవండి.) 'మా రుణాలు క్షమించుము' అనే మాటలు, యేసు విమోచన క్రయధనం మనకు అవసరమైనట్టే, మన సహోదరసహోదరీలకు కూడా అవసరమని గుర్తుచేస్తాయి. అంతేకాదు, మనం కేవలం మన గురించే కాకుండా, తోటి సహోదరసహోదరీల గురించి, వాళ్లకు యెహోవాతో ఉన్న స్నేహం గురించి కూడా ఆలోచించాలని దేవుడు కోరుకుంటున్నాడు. అప్పుడు, ఇతరులు మన విషయంలో ఏవైనా పొరపాట్లు చేసినా మనం వెంటనే క్షమిస్తాం. అలాంటి చిన్నచిన్న పొరపాట్లను క్షమించడం ద్వారా మనకు వాళ్లపట్ల ప్రేమ ఉందని చూపిస్తాం. అంతేకాదు, యెహోవా మన తప్పులను క్షమిస్తున్నందుకు మనకు కృతజ్ఞత ఉందని చూపిస్తాం.—కొలొ. 3:13.

11 ఎంతైనా మనం అపరిపూర్ణులం కాబట్టి, మనల్ని నొప్పించిన వ్యక్తిని క్షమించడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుంది. (లేవీ. 19:18) అయితే ఆ వ్యక్తి మనల్ని నొప్పించిన సంగతి మనం అందరికీ చెప్తే, సంఘంలోని ఇతరులు ఆయన్ని దూరం పెట్టవచ్చు. అలా మనం సంఘ ఐక్యతను దెబ్బతీసినవాళ్లం అవుతాం. ఆ పరిస్థితిని అలాగే కొనసాగనిస్తే, యేసు బలిపట్ల మనకు గౌరవం లేదని చూపించినవాళ్ల

---

**10.** యెహోవా మన పాపాల్ని దేని ఆధారంగా క్షమిస్తున్నాడు? దాని గురించి మనమెలా భావించాలి?

**11.** ఇతరుల్ని క్షమించడం ఎందుకు ప్రాముఖ్యం?

యెహోవా మిమ్మల్ని క్షమించాలంటే మీరు ఇతరుల్ని క్షమించాలి
(11వ పేరా చూడండి)



మాత్రం. అలాచేస్తే ఆ బలివల్ల వచ్చే ప్రయోజనాల్ని మనం పొందలేం. మనం ఇతరుల్ని క్షమించకపోతే, యెహోవా కూడా మనల్ని క్షమించడు. (**మత్తయి 6:14, 15** చదవండి; మత్త. 18:35) అలాగే, యెహోవా క్షమాపణను పొందాలంటే మనం గంభీరమైన పాపాల్ని చేస్తూ ఉండకూడదు.—1 యోహా. 3:4, 6.

## 'మమ్మల్ని శోధనలోకి తీసుకురావద్దు'

12 'మమ్మల్ని శోధనలోకి తీసుకురావద్దు' అనే మాటలు, బాప్తిస్మం తర్వాత యేసుకు ఎదురైన పరిస్థితిని మనకు గుర్తుచేస్తాయి. "యేసు అపవాదిచేత శోధింపబడుటకు ఆత్మవలన అరణ్యమునకు కొనిపోబడెను" అని బైబిలు చెప్తుంది. (మత్త. 4:1; 6:13) అలా జరిగేలా యెహోవా ఎందుకు అనుమతించాడు? దానికి జవాబు తెలుసుకోవాలంటే అసలు యెహోవా యేసును భూమ్మీదకు ఎందుకు పంపించాడో ఆలోచించాలి. ఆదాము హవ్వలు యెహోవా పరిపాలనను వద్దనుకున్నప్పుడు సాతాను కొన్ని ప్రశ్నలు లేవదీశాడు. ఉదాహరణకు, యెహోవా మనుషుల్ని తయారుచేసిన విధానంలో ఏదైనా లోపం ఉందా? 'దుష్టుడు' శోధిస్తున్నా ఓ పరిపూర్ణ మనిషి యెహోవాకు నమ్మకంగా ఉండగలడా? మనుషులు తమను తామే పరిపాలించుకుంటే పరిస్థితి ఇంకా బాగుంటుందా? వాటికి జవాబు రావడానికి సమయం పట్టింది. (ఆది. 3:4, 5) యేసు యథార్థంగా ఉండడం ద్వారా సాతాను వేసిన నిందలన్నీ అబద్ధాలని నిరూపించాడు. భవిష్యత్తులో యెహోవా దేవుడు, సాతాను ప్రశ్నలన్నిటికీ దీటైన జవాబిచ్చినప్పుడు, పరలోకంలోనూ భూమ్మీద ఉన్నవాళ్లందరూ యెహోవా పరిపాలనే అత్యుత్తమమైనదని తెలుసుకుంటారు.

13 యెహోవా పరిశుద్ధుడు కాబట్టి చెడ్డ పనులు చేసేలా ఆయన ఎవర్నీ శోధించడు. మనల్ని 'శోధించేవాడు' సాతానే. (మత్త. 4:3) సాతాను మనల్ని ఎన్నో రకాలుగా శోధిస్తాడు. అయితే, వాటిని ఎదిరించాలా లేక వాటికి లొంగిపోవాలా అని నిర్ణయించుకోవాల్సింది మనమే. (**యాకోబు 1:13-15** చదవండి.) యేసుక్రీస్తు దేవుని వాక్యంలోని మాటల్ని ఎత్తిచెప్తూ సాతాను శోధనల్ని వెంటనే తిప్పికొట్టాడు. అలా యేసు దేవునికి నమ్మకంగా ఉన్నాడు. కానీ సాతాను పట్టువదలకుండా, ఆయన్ను శోధించే "మరో అవకాశం చిక్కేవరకు" ఎదురుచూశాడు. (లూకా 4:13, *పవిత్ర గ్రంథం, వ్యాఖ్యాన సహితం*) సాతాను ఎంత ప్రయత్నించినా యేసు మాత్రం దేవుని పరిపాలనకే ఎల్లప్పుడూ లోబడ్డాడు. అలా, ఎన్ని తీవ్రమైన శోధనలు వచ్చినా ఓ పరిపూర్ణ మానవుడు యెహోవాకు యథార్థంగా ఉండగలడని ఆయన నిరూపించాడు. అయితే సాతాను మాత్రం, దేవునికి అవిధేయత చూపించేలా యేసు అనుచరుల్ని శోధిస్తూనే ఉన్నాడు. వాళ్లలో మీరు కూడా ఉన్నారని గుర్తుంచుకోండి.

14 యెహోవా పరిపాలన గురించి సాతాను లేవదీసిన ప్రశ్నలకు జవాబు రావడానికి ఇంకా సమయం ఉంది. కాబట్టి మనల్ని శోధించడానికి యెహోవా సాతానును అనుమతిస్తున్నాడు. అంతేకానీ యెహోవా మనల్ని 'శోధనలోకి తీసుకురాడు.' నిజానికి, మనం యథార్థంగా ఉంటామనే నమ్మకం ఆయనకు ఉంది, మనకు సహాయం చేయాలని కోరుకుంటున్నాడు కూడా. అయితే సరైనది చేసేలా యెహోవా మనల్ని ఎన్నడూ బలవంతపెట్టడు. ఈ విషయంలో మనకున్న స్వేచ్ఛను ఆయన గౌరవిస్తున్నాడు. కాబట్టి ఆయనకు యథార్థంగా ఉండాలో వద్దో నిర్ణయించుకోవాల్సింది మనమే. అయితే, శోధనలకు లొంగిపోకూడదంటే మనం రెండు పనులు చేయాలి. యెహోవాకు దగ్గరగా ఉండాలి, ఆయన సహాయం కోసం ప్రార్థిస్తూ ఉండాలి. అలాంటి ప్రార్థనలకు యెహోవా ఎలా జవాబిస్తాడు?

15 శోధనల్ని ఎదిరించడానికి కావాల్సిన బలాన్ని, సహాయాన్ని యెహోవా తన పరిశుద్ధాత్మ ద్వారా మనకు ఇస్తాడు. అంతేకాక, మనకు ఎదురయ్యే ప్రమాదాల గురించి బైబిలు ద్వారా, సంఘం ద్వారా ఆయన మనల్ని హెచ్చరిస్తాడు.

---

**12, 13.** (ఎ) బాప్తిస్మం తర్వాత యేసుకు ఎలాంటి పరిస్థితి ఎదురైంది? (బి) మనం శోధనలకు లొంగిపోతే వేరేవాళ్లను ఎందుకు తప్పుపట్టకూడదు? (సి) తన చివరి శ్వాస వరకు యథార్థంగా ఉండడం ద్వారా యేసు ఏమి నిరూపించాడు?

**14.** శోధనలకు లొంగిపోకూడదంటే మనం ఏ రెండు పనులు చేయాలి?

**15, 16.** (ఎ) మనం ఏయే శోధనల్ని ఎదిరించాలి? (బి) మనం శోధనలకు లొంగిపోతే తప్పు ఎవరిది?



యెహోవాకు దగ్గరగా ఉంటూ ఉత్సాహంగా పరిచర్యలో పాల్గొనండి (15వ పేరా చూడండి)

ఉదాహరణకు, మనకు నిజంగా అవసరంకానివాటి కోసం మన సమయాన్ని, డబ్బును, శక్తిని వృథా చేయొద్దని ఆయన మనల్ని హెచ్చరిస్తున్నాడు. ఈ అనుభవాన్ని పరిశీలించండి. ఇస్పెన్, యానె అనే జంట యూరప్‌లోని ఓ సంపన్న దేశంలో ఉంటున్నారు. వాళ్లు తమ దేశంలోనే, అవసరం ఎక్కువున్న ఓ ప్రాంతంలో ఎన్నో ఏళ్లపాటు క్రమ పయినీర్లుగా సేవ చేశారు. అయితే వాళ్లకు ఒక బాబు పుట్టడంతో పయినీరు సేవ ఆపేయాల్సి వచ్చింది, ఇప్పుడు వాళ్లకు ఇద్దరు పిల్లలు. ఇస్పెన్ ఇలా అంటున్నాడు, 'మేము ఇంతకు ముందులా ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో ఎక్కువ సమయం గడపలేకపోతున్నాం కాబట్టి శోధనలకు లొంగిపోకుండా సహాయం చేయమని మేము తరచూ యెహోవాకు ప్రార్థిస్తుంటాం. అంతే కాదు యెహోవాతో మా స్నేహాన్ని, పరిచర్యలో మా ఉత్సాహాన్ని కాపాడుకోవడానికి సహాయం చేయమని కూడా వేడుకుంటాం.'

16 మనం ఎదిరించాల్సిన మరో శోధన, అశ్లీల చిత్రాలు చూడడం. ఒకవేళ మనం ఈ శోధనకు లొంగిపోతే సాతానును తప్పుపట్టకూడదు. ఎందుకు? ఎందుకంటే సాతానుగానీ అతని లోకంగానీ, మనకు ఇష్టంలేని పనిని చేసేలా మనల్ని బలవంతపెట్టలేరు. కొంతమంది, తప్పుడు విషయాల గురించే ఆలోచిస్తూ ఉండడం వల్ల అశ్లీల చిత్రాలను చూశారు. కానీ మన సహోదరసహోదరీల్లో చాలామంది ఈ శోధనను ఎదిరించారు. మనం కూడా ఎదిరించగలం.—1 కొరిం. 10:12, 13.

## 'దుష్టుని నుండి మమ్మల్ని తప్పించుము'

17 యెహోవా మనల్ని 'దుష్టుని నుండి తప్పించాలని' మనం నిజంగా కోరుకుంటే ఏమి చేయాలి? మనం 'లోకసంబంధులుగా' ఉండకూడదు, అలాగే 'లోకాన్నిగానీ లోకంలో ఉన్నవాటినిగానీ ప్రేమించకూడదు.' (యోహా. 15:19; 1 యోహా. 2:15-17) యెహోవా సాతానును, అతని దుష్ట లోకాన్ని నాశనం చేసినప్పుడు ఎంత ప్రశాంతంగా ఉంటుందో! అయితే అప్పటివరకు ఒక విషయాన్ని అస్సలు మర్చిపోకండి, "తనకు సమయము కొంచెమే అని తెలిసికొని" సాతాను చాలా కోపంగా ఉన్నాడు. మనల్ని యెహోవా ఆరాధన నుండి దూరం చేయడానికి అతను ఎంతకైనా తెగిస్తాడు. కాబట్టి సాతాను నుండి కాపాడమని మనం యెహోవాకు ప్రార్థిస్తూనే ఉండాలి.—ప్రక. 12:12, 17.

18 సాతానులేని లోకంలో జీవించాలని మీకు ఉందా? అయితే దేవుని రాజ్యం రావాలనీ, యెహోవా నామం పరిశుద్ధపర్చబడాలనీ, ఆయన చిత్తం భూమ్మీద నెరవేరాలనీ ప్రార్థిస్తూ ఉండండి. మీ ఆధ్యాత్మిక, భౌతిక అవసరాలన్నిటి కోసం యెహోవాపై ఆధారపడండి. అవును, యేసు నేర్పించిన మాదిరి ప్రార్థన ప్రకారం జీవించడానికి చేయగలిగినదంతా చేయండి.

---

**17.** (ఎ) యెహోవా మనల్ని 'దుష్టుని నుండి తప్పించాలని' మనం నిజంగా కోరుకుంటే ఏమి చేయాలి? (బి) మనమెప్పుడు నిజమైన ప్రశాంతత అనుభవిస్తాం?
**18.** ఈ దుష్టలోక అంతాన్ని తప్పించుకోవాలంటే మనమేమి చేస్తూ ఉండాలి?

# ‘మీకు సహనం అవసరం’

**అనిత*** యెహోవాసాక్షి అయినప్పుడు ఆమె భర్త తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆమెను కూటాలకు వెళ్లనిచ్చేవాడు కాదు, కనీసం దేవుని పేరు ఎత్తినా ఊరుకునేవాడు కాదు. ఆమె ఎప్పుడైనా యెహోవా పేరు పలికితే, ఆయనకు చాలా కోపం వచ్చేది.

అంతేకాదు, ఆమె పిల్లలకు యెహోవా గురించి చెప్పినా, వాళ్లను కూటాలకు తీసుకువెళ్లినా అస్సలు ఊరుకునేవాడు కాదు. దాంతో తన భర్తకు తెలీకుండా వాళ్లకు యెహోవా గురించి నేర్పించడం అనితకు చాలా కష్టంగా ఉండేది.

బహుశా అనిత లాంటి పరిస్థితే మీరూ ఎదుర్కొంటుండవచ్చు, మీరు యెహోవాను ఆరాధించకుండా మీ కుటుంబ సభ్యులు వ్యతిరేకిస్తుండవచ్చు. లేదా చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడడం లేదా మీ బిడ్డగానీ, భర్త/భార్యగానీ చనిపోవడం లేదా మీ కుటుంబ సభ్యుల్లో ఒకరు యెహోవాను విడిచిపెట్టడం వంటి కష్టాలవల్ల గుండెకోత అనుభవిస్తుండవచ్చు. మరి ఇలాంటి పరిస్థితుల్లో మీరు యెహోవాకు ఎలా నమ్మకంగా ఉండవచ్చు?

అపొస్తలుడైన పౌలు ఇలా చెప్పాడు, ‘మీకు ఓరిమి [సహనం] అవసరం.’ (హెబ్రీ. 10:36) అయితే, సహనంగా ఉండడానికి మీకేవి సహాయం చేస్తాయి?

## సహాయం కోసం యెహోవాకు ప్రార్థించండి

కష్టాల్ని సహించాలంటే మనం సహాయం కోసం యెహోవాకు ప్రార్థిస్తూ ఆయనపై ఆధారపడాలి. అనా అనే ఓ సహోదరి అనుభవాన్ని పరిశీలించండి. ఆమె భర్త అకస్మాత్తుగా చనిపోయాడు. వాళ్లకు పెళ్లై 30 ఏళ్లు అయింది. ఆమె ఇలా చెప్తుంది, ‘ఆయన ఆఫీస్‌కు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన వయసు 52 ఏళ్లే.’

మరి అనా ఆ బాధను ఎలా తట్టుకోగలిగింది? ఆమె మళ్లీ ఉద్యోగానికి వెళ్లాల్సి వచ్చింది, ఆ పనిలో పూర్తిగా నిమగ్నమవ్వడం వల్ల ఆమె కాస్త కోలుకుంది. కానీ ఆ బాధ మాత్రం పూర్తిగా పోలేదు. ఆమె ఇలా చెప్తోంది, ‘నా మనసులోని బాధంతా యెహోవాకు చెప్పుకుని నాకు సహాయం చేయమని వేడుకున్నాను.’ అలా ప్రార్థించిన తర్వాత ఆమె మనసు కుదుటపడి ప్రశాంతంగా అనిపించేది, దాంతో యెహోవా తనకు సహాయం చేశాడని ఆమెకు అర్థమైంది. ఆమె ఇంకా ఇలా చెప్తోంది, ‘యెహోవా నా భర్తను తప్పకుండా తిరిగి బ్రతికిస్తాడని నాకు తెలుసు.’—ఫిలి. 4:6, 7.

తన సేవకుల ప్రార్థనలు వింటానని యెహోవా మాటిస్తున్నాడు. (కీర్త. 65:2) తన సేవలో కొనసాగడానికి అవసరమైనవన్నీ ఆయన ఇస్తాడు. కష్టాలొచ్చినప్పుడు కూడా మీరు నమ్మకంగా ఉండడానికి ఆయన సహాయం చేస్తాడు.

## సహోదరసహోదరీలతో సన్నిహితంగా ఉండండి

సంఘంలోని సహోదరసహోదరీల ద్వారా కూడా యెహోవా మనకు సహాయం చేస్తాడు. థెస్సలోనిక సంఘంలోని వాళ్లు, తీవ్రమైన హింసలు వచ్చినప్పుడు ఒకరికొకరు సహాయం చేసుకున్నారు. ఆ పరిస్థితుల్లో వాళ్లు ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ఉండడం చాలా ముఖ్యం. (1 థెస్స. 2:14; 5:11) వాళ్లు ప్రేమతో ఒకరికొకరు దగ్గరౌతూ, సహాయం చేసుకుంటూ తమకు ఎదురైన విశ్వాస పరీక్షను దాటగలిగారు. వాళ్లలాగే మనం కూడా కష్టాల్ని సహించాలంటే ఏమి చేయాలి?

మనం సంఘంలోని వాళ్లతో సన్నిహితంగా ఉంటూ ఒకర్నొకరు ప్రోత్సహించుకోవాలి, మరిముఖ్యంగా కష్టాలొచ్చినప్పుడు అలా చేయడం ప్రాముఖ్యం. (రోమా. 14:19) అపొస్తలుడైన పౌలు తీవ్రమైన హింసల్ని, ఇతర ఇబ్బందుల్ని ఎదుర్కొన్నాడు. అయితే వాటిని సహించడానికి కావాల్సిన బలాన్ని యెహోవా ఆయనకు ఇచ్చాడు. యెహోవా కొన్నిసార్లు సహోదరసహోదరీల ద్వారా పౌలును ప్రోత్సహించాడు. వాళ్ల గురించి పౌలు ఇలా చెప్పాడు, “వీరి వలన నాకు ఆదరణ కలిగెను.” (కొలొ. 4:10, 11) వాళ్లు పౌలును ఎంతో ప్రేమించారు, అందుకే ఆయనకు సహాయం అవసరమైనప్పుడు వాళ్లు ఆయన్ను ఓదార్చి, ప్రోత్సహించారు. అదేవిధంగా, మీ సంఘంలోని సహోదరసహోదరీలు కూడా తమ మాటల ద్వారా, చేతల ద్వారా మిమ్మల్ని ఎన్నోసార్లు ప్రోత్సహించి ఉంటారు.

## సంఘపెద్దల సహాయం తీసుకోండి

సంఘపెద్దల ద్వారా కూడా యెహోవా మనకు సహాయం చేస్తాడు. వాళ్లు మనల్ని ప్రోత్సహించి, బైబిలు నుండి మనకు కావాల్సిన చక్కని సలహాలు ఇస్తారు. వాళ్లు ‘గాలికి

* అసలు పేర్లు కావు.



ఇతరులు కష్టాల్ని ఎలా సహించారో ఆలోచిస్తే, మనం కూడా సహించగలుగుతాం

మరుగైనచోటువలె గాలివానకు చాటైన చోటువలె ఉంటారు. ఎండినచోట నీళ్లకాలువలవలెను అలసట పుట్టించు దేశమున గొప్పబండ నీడవలె ఉంటారు.’ (యెష. 32:2) మనకు సహాయం చేయడానికి సంఘపెద్దలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలుసుకోవడం మనకు ఊరటనిస్తుంది. కాబట్టి కష్టాలొచ్చినప్పుడు సంఘపెద్దల సహాయాన్ని తీసుకోండి. మీరు యెహోవాను సేవిస్తూ ఉండడానికి వాళ్లు సహాయం చేస్తారు.

నిజమే, వాళ్లు కూడా మనలా అపరిపూర్ణులే కాబట్టి వాళ్లు మన సమస్యలన్నిటినీ పరిష్కరించలేరు. (అపొ. 14:15) కానీ పెద్దలు మనకోసం చేసే ప్రార్థనలవల్ల మనకెంతో ప్రయోజనం ఉంటుంది. (యాకో. 5:14, 15) ఉదాహరణకు, ఇటలీలో ఎన్నో ఏళ్లుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఓ సహోదరుణ్ణి పెద్దలు ప్రోత్సహించారు. ఆయనిలా చెప్పాడు, ‘వాళ్లు నా మీద చూపించిన ప్రేమాప్యాయతలు, నన్ను చూడడానికి తరచూ మా ఇంటికి రావడం ఇవన్నీ నా బాధను సహించడానికి నాకు సహాయం చేశాయి.’ మీరు కూడా ఏదైనా కష్టంలో ఉన్నప్పుడు, సంఘపెద్దల సహాయం తీసుకోవాలని యెహోవా కోరుకుంటున్నాడు.

## యెహోవా సేవ మీదే దృష్టి నిలపండి

మనం యెహోవా సేవ మీద దృష్టి పెడితే, ఆయన మనకు ఏవిధంగా సహాయం చేస్తాడో స్వయంగా తెలుసుకుంటాం. జాన్ అనే సహోదరుని విషయంలో అదే జరిగింది. ఆయనకు 39 ఏళ్లున్నప్పుడు, ఓ అరుదైన క్యాన్సర్ ఉందని వైద్యపరీక్షల్లో తేలింది. చిన్నవయసులోనే తనకు అంత భయంకరమైన జబ్బు రావడం అన్యాయమని ఆయన కుమిలిపోయాడు. తన భార్యను, మూడేళ్ల తన కొడుకును తలుచుకుని ఆయన చాలా బాధపడ్డాడు. ఆయనిలా అంటున్నాడు, ‘మా అబ్బాయి మంచిచెడ్డలతోపాటు నా చికిత్సకు సంబంధించిన విషయాలు కూడా మా ఆవిడే చూసుకోవాల్సి వచ్చింది.’ కీమోథెరఫీ చికిత్స వల్ల జాన్ చాలా నీరసించిపోయేవాడు, ఇతర అనారోగ్య సమస్యల్ని కూడా ఎదుర్కొనేవాడు. అంతేకాకుండా, ఆ సమయంలోనే తన తండ్రి చావుబతుకుల మధ్య ఉన్నాడని, ఆయన బాగోగులు చూసుకోవాల్సిన అవసరముందని జాన్‌కు తెలిసింది.

మరి జాన్, ఆయన కుటుంబ సభ్యులు ఆ కష్టాల్ని ఎలా తట్టుకున్నారు? జాన్‌కు నీరసంగా అనిపించినా, తన కుటుంబమంతా యెహోవా సేవకు మొదటిస్థానం ఇచ్చేలా చూసేవాడు. ఆయనిలా చెప్తున్నాడు, ‘మేము కూటాలన్నిటికీ వెళ్లేవాళ్లం, ప్రతీవారం పరిచర్యకు వెళ్లేవాళ్లం. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు కూడా కుటుంబ ఆరాధనను తప్పకుండా చేసుకునేవాళ్లం.’ యెహోవాతో బలమైన సంబంధం ఉంటే ఎలాంటి కష్టాన్నైనా తట్టుకోవచ్చని జాన్ గ్రహించాడు. తన పరిస్థితి గురించి మొదట్లో ఆందోళనపడినా, కొంత కాలంలోనే ఆ బాధ నుండి తేరుకున్నాడు. యెహోవా తనను ప్రేమించి, తనకు కావాల్సిన బలాన్ని ఇచ్చాడని జాన్ అర్థం చేసుకున్నాడు. మీరు కష్టాల్లో ఉన్నప్పుడు యెహోవా మీకు కూడా అదేవిధంగా సహాయం చేయగలడు. జాన్ ఇలా చెప్తున్నాడు, ‘యెహోవా నన్ను బలపర్చినట్లే మిమ్మల్ని కూడా బలపర్చగలడు.’

కష్టాల్లో ఉన్నప్పుడు, ‘మీకు ఓరిమి [సహనం] అవసరం’ అని పౌలు చెప్పిన మాటల్ని గుర్తుతెచ్చుకోండి. యెహోవాకు ప్రార్థిస్తూ ఆయనపై ఆధారపడండి. తోటి సహోదరసహోదరీలతో సన్నిహితంగా ఉండండి, సంఘపెద్దల సహాయం తీసుకోండి, యెహోవా సేవ మీదే దృష్టి పెట్టండి. ఇప్పుడు మీకు ఏ సమస్య ఉన్నా లేదా ముందుముందు ఎలాంటి సమస్య వచ్చినా, సహించడానికి యెహోవా మీకు సహాయం చేస్తాడు.

## మీకు జ్ఞాపకమున్నాయా?

### మీరు ఇటీవలి కావలికోట సంచికలను జాగ్రత్తగా చదివారా? అయితే, ఈ కింది ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలరేమో చూడండి:

**ప్రతీ సంవత్సరం క్రీస్తు మరణ జ్ఞాపకార్థ ఆచరణకు మనమెలా సిద్ధపడవచ్చు?**

జ్ఞాపకార్థ ఆచరణ కాలంలో చదవాల్సిన లేఖనాలను చదవడం ద్వారా, పరిచర్యలో ఎక్కువ సమయం గడపడం ద్వారా, దేవుడు మనకు వాగ్దానం చేసిన భవిష్యత్తు గురించి ప్రార్థిస్తూ ఆలోచించడం ద్వారా మనం సిద్ధపడవచ్చు.—1/15, 14-16 పేజీలు.

**జపాన్‌లోని సాక్షులు ఏ ఆశ్చర్యకరమైన బహుమతిని అందుకున్నారు?**

నూతనలోక అనువాదంలోని మత్తయి సువార్తను, ఓ చిన్న పుస్తకంగా రూపొందించారు. ప్రచారకులు ఆ పుస్తకాన్ని పరిచర్యలో ఉత్సాహంగా అందిస్తున్నారు. బైబిలు గురించి అంతగా తెలియని చాలామంది జపాన్ ప్రజలు ఆ పుస్తకాన్ని చదవడానికి ఇష్టపడుతున్నారు.—2/15, 3వ పేజీ.

**మొదటి శతాబ్దంలోని ఏ పరిస్థితులు క్రైస్తవుల ప్రకటనా పనికి అనుకూలించాయి?**

***పాక్స్ రోమనా*** అనే మాట రోమా సామ్రాజ్యమంతటా శాంతి వర్ధిల్లిందని తెలియజేస్తుంది. తొలి శిష్యులు సౌకర్యవంతమైన రోడ్లపై ప్రయాణించగలిగారు. చాలామంది ప్రజలు గ్రీకు భాషను మాట్లాడడంవల్ల, రోమా సామ్రాజ్యమంతటా విస్తరించివున్న యూదులతో సహా ఎక్కువమందికి సువార్త ప్రకటించడం వీలైంది. అంతేకాదు, సువార్త పనిని సమర్థించడానికి శిష్యులు రోమా చట్టాన్ని ఉపయోగించుకోగలిగారు.—2/15, 20-23 పేజీలు.

**ఈ మధ్య కాలంలో మన ప్రచురణలు, పోలికలు లేదా సాదృశ్యాల గురించి ఎందుకు అంతగా ప్రస్తావించట్లేదు?**

కొంతమంది వ్యక్తులు రాబోయే మరింత గొప్పవాళ్లను లేదా గొప్పవాటిని సూచించారని బైబిలు చెప్తుంది. అలాంటి ఓ ఉదాహరణను గలతీయులు 4:21-31 వచనాల్లో చూడవచ్చు. అయితే బైబిలు అలా చెప్పనప్పుడు, వాళ్లు వేరేవాళ్లకు లేదా వేరేవాటికి సాదృశ్యంగా ఉన్నారని మనం అనుకోకూడదు. బదులుగా బైబిల్లోని వ్యక్తుల నుండి, సంఘటనల నుండి మనం నేర్చుకోగల విలువైన పాఠాలకే ప్రాముఖ్యతనివ్వాలి. (రోమా. 15:4)—3/15, 17-18 పేజీలు.

**క్రైస్తవులు యేసుకు ప్రార్థన చేయవచ్చా?**

లేదు. మనం యెహోవాకు ప్రార్థించాలని యేసే స్వయంగా చెప్పాడు. అంతేకాదు, ఆయన కూడా తండ్రికి ప్రార్థించి మనకు ఆదర్శం ఉంచాడు. (మత్త. 6:6-10; యోహా. 11:41; 16:23) అందుకే, ఆయన తొలి శిష్యులు కూడా యెహోవాకే ప్రార్థించారుగానీ యేసుకు కాదు. (అపో. 4:24, 30; కొలొ. 1:3, 4)—4/1, 14వ పేజీ.

**సంఘపెద్దలు ఇతరులకు ఎలా శిక్షణ ఇవ్వవచ్చు?**

పెద్దలు, తాము శిక్షణ ఇస్తున్న సహోదరుల్ని పోటీదారులుగా కాకుండా, సంఘ అవసరాల్ని తీర్చడంలో తమతోపాటు 'కలిసి పనిచేసే వాళ్లుగా' చూస్తూ అమూల్యంగా ఎంచుతారు. (2 కొరిం. 1:24, *పరిశుద్ధ బైబల్: తెలుగు ఈజీ-టు-రీడ్ వర్షన్*) అంతేకాదు, మంచి ఫలితాలు సాధించాలంటే శిక్షణ ఇవ్వడాన్ని ప్రేమించడంతోపాటు, శిక్షణ పొందుతున్న వ్యక్తిని ప్రేమించాలని కూడా పెద్దలు అర్థంచేసుకుంటారు. (సామె. 17:17; యోహా. 15:15)—4/15, 6-7 పేజీలు.

**యెహోవా మనతో ఎలా మాట్లాడతాడు?**

మనం క్రమంగా బైబిలు చదువుతూ, అధ్యయనం చేస్తూ, చదువుతున్న వాటి గురించి ఎలా భావిస్తున్నామో పరిశీలించుకోవాలి. అంతేకాక, నేర్చుకున్నవాటిని ఎలా పాటించవచ్చో ఆలోచించాలి. అలాచేస్తే, తన వాక్యం ద్వారా యెహోవా చెప్పేది మనం వింటాం, ఆయనకు ఇంకా దగ్గరౌతాం. (హెబ్రీ. 4:12; యాకో. 1:23-25)—4/15, 20వ పేజీ.

**తప్పులు చేస్తూ పశ్చాత్తాపపడని వ్యక్తిని బహిష్కరించడం ఎందుకు ప్రేమతో చేసిన ఏర్పాటు?**

తప్పులు చేస్తున్న వ్యక్తిని బహిష్కరించాలని బైబిలు చెప్తుంది. నిజానికి ఆ ఏర్పాటువల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. (1 కొరిం. 5:11-13) అది యెహోవా నామానికి ఘనత తెస్తుంది, సంఘాన్ని పవిత్రంగా ఉంచుతుంది, బహిష్కరించబడిన వ్యక్తి తన తప్పు తెలుసుకునేలా చేస్తుంది.—4/15, 29-30 పేజీలు.

JW.ORG™

ఈ పత్రిక, అలాగే ఇతర ప్రచురణలు www.jw.org వెబ్‌సైట్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

100 కన్నా ఎక్కువ భాషల్లో ఉన్న నూతనలోక అనువాదం బైబిల్ని మీరు ఆన్‌లైన్‌లో చదువుకోవచ్చు

www.jw.org/te చూడండి లేదా ఈ కోడ్ స్కాన్ చేయండి

w15 06/15-TU
150304